విలక్షణ నటుడు

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 06, 2015

# సైకిల్ వాలా పద.. పద..

# ..న్యాయం చేయగలనా!

బాలీవుడ్‌లో తిరుగులేని నటి కరీనా కపూర్. కపూర్ కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు కీర్తి, విజయం, గ్లామర్ కొత్తవేం కాకపోయినా... వారసత్వానికి అతీతంగా తనను తాను నిరూపించుకోవాలని అనుకోవడమే కాదు. అనుకున్నది సాధించింది కూడా. అటు నటన ఇటు గ్లామర్ వున్న పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి శభాష్ అనిపించుకుంది బెబో. తన సినీవ్యక్తిగత జీవితం గురించి ఆమె మాటల్లోనే...

.....................................................................................................

- అశేష ప్రేక్షకులను ఆకట్టుకొనే గ్లామర్ పాత్రలతోపాటు నటనకు ప్రాధాన్యం ఉన్న సినిమాలు కూడా చేయాలనుకుంటున్నా. నా దృష్టిలో వ్యాపారపరమైన విజయమూ, వృత్తిపరమైన విజయమూ రెండూ ముఖ్యమే. కాని అన్నిటికన్నా ముఖ్యమైంది ఒక మంచి సినిమా తీయడం. మన ముందున్న భజరంగీ భాయ్‌జాన్ అలాంటిదే. ఇందులో నేను స్కూలు టీచరుగా నటించాను. సల్మాన్‌ఖాన్ ఓ మూగపిల్లతో చాందినిచౌక్‌కి వచ్చిన తరువాత నా పాత్ర అతను అక్కడి నుండి పాకిస్థాన్ వెళ్ళడానికి సహాయపడుతుంది. అతను సరైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. ఇందులో సహాయనటిగా తృప్తి పడాల్సి వచ్చినా... పరిశ్రమకు వచ్చి పదిహేను సంవత్సరాలు గడిచిపోయినా... ఇప్పుడు నాకిష్టమైందల్లా మంచి సినిమాల్లో నటించడం మాత్రమే.
- నాకెప్పుడూ పెద్ద స్టార్ అవ్వాలనుండేది, మంచి నటి అనిపించుకోవలాని కూడా ఉండేది. ఒక పక్క బ్లాక్‌బస్టర్ సినిమాల్లో గ్లామరస్ హీరోయిన్‌గానూ, మరో పక్క ఛమేలి, ఓంకార వంటి చిత్రాల్లో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో చేస్తూ సక్సెస్‌నూ, నటనాపరమైన తృప్తినీ ఒకేసారి పూర్తిగా ఆస్వాదిస్తున్నాను.
- నేను కేవలం కమర్షియల్ సినిమాలే చేయాలనో లేక కేవలం 'ఛమేలి' లాంటి క్లాసిక్ సినిమాలే చేయాలనో అనుకోవడం లేదు. నాకు అందరితో కలిసి పని చేయాలని ఉంటుంది. ఈ ప్రయాణం అద్భుతమైంది.
- మనల్ని మన కంటే చిన్ననటులతో పోల్చి చూడటం ఎప్పటికీ బావుంటుంది. మొదట్లో ఇది నన్ను కొంత చిరాకు పెట్టేది. కాని ఇప్పుడు నాకది అలవాటయిపోయింది. ఆలియా గొప్ప సౌందర్యరాశి. అద్భుతమైన నటి. ఆమెని నాతో పోల్చిచూడటం ఆమెను ఎంత చిరాకుపరుస్తుందో నాకయితే తెలియదు. మేమిద్దరం 'ఉడ్తా పంజాబ్' షూటింగ్‌లో కలుస్తూ ఉంటాము. ఇద్దరం అందులో నటిస్తున్నా మా ఇద్దరిని కలిసి షూట్ చేసిన సన్నివేశాలు ఇంకా రాలేదు. కాని షూటింగ్ సెట్స్‌లో ఆమె నాకు మంచి స్నేహితురాలయింది.

- ఇక సినిమా గురించి చెప్పకోవాల్సి వస్తే ... ఇది ఒక అద్భుతమైన సినిమా. నేను మళ్ళీ కథనే ఎంచుకున్నాను. ఇందులో ఒక డాక్టరుగా పనిచేస్తున్నాను. అది ఈ సినిమాకు వెన్నెముకలాంటి పాత్ర. 'భజరంగి' లో కనిపించినదానికంటే పూర్తి భిన్నంగా కనిపిస్తాను. ఈ సినిమానేకాక బాల్కి తీస్తున్న పేరుపెట్టని మరొక సినిమాలో నటిస్తున్నాను. స్వేచ్ఛగా జీవిస్తూ ఉద్యోగం చేసుకునే మహిళ పాత్ర అది. వాస్తవంగా జరిగిన ఆధునిక ప్రేమ కథ అది. ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో తెలీదు. ఈ రెండు పాత్రలకు ఎంతవరకు న్యాయం చేయాలి అన్న ఆలోచన, ఆందోళనలే ప్రస్తుతం నాలో వున్నాయి.
- పెళ్ళయిన తరువాత నేను సంతోషంగా ఉన్నాను. కెరీర్, కుటుంబం...ఇలా దేనికోసమైనా సరే పని చేయాల్సిందే. చేస్తున్న పనిని ఎంజాయ్ చేయగలగాలి. చాలామంది సంతోషంగా లేకపోవడానికి కారణం ... వాళ్ళు చేస్తున్న పనిని ఆస్వాదించకపోవడమే. నీవు చేస్తున్న పనిలో నీవు ఆనందం పొందగలిగితే జీవితం ఉల్లాసంగా గడిచిపోతుంది.

●

◆ మనలో మాట

# ఆకాశంలో ఆ మూడు...

**బం**గారం అంటే ఎవరికి ఇష్టముండదు! కాకపోతే పెద్ద పెద్ద వాళ్ల మెడల్లో మాత్రమే మెరిసిపోతూ చిన్న వాళ్లను చూసి వెక్కిరిస్తుంటుంది. అలాంటి పుత్తడి ధర అమాంతం పెరిగిపోయినా పెద్దగా బాధ అనిపించలా. అధిక శాతం భూమి ఎప్పుడూ పెద్దల కబంధ హస్తాల్లో బందీనే. అలాంటి నేల రేటు ఎన్ని రెట్లు పెరిగినా సరే ఎందుకో అంత భారం అనిపించలా.

అదేంటోగాని ఎక్కడో కిక్కిరిసిన గోతాల్లో, గోదాముల్లో అనామకంగా....అనాథలుగా... పడుండే ఉల్లి, కంది పప్పు, చింతపండు ధర పెరిగితే మాత్రం కళ్లెంట నీళ్లు వస్తున్నాయి. కాళ్లు చేతులు ఆడడం లేదు. నిద్రలోనూ, మెలకువలోనూ వాటి గురించిన ఆలోచనలే. పీడ కలలు ఫ్రీ గా ప్రాప్తిస్తున్నాయి!

మరి...ఉల్లిపాయల కోసం హుషారుగా రైతు బజార్లకెళ్లిన వాళ్లు గంటలు...పూటలు...గడిచినా అయిపూ అజా లేకపోతే ఇంట్లో వాళ్లకు కంగారే కదా. పలు మెలికలు తిరిగిన చేంతాడంత క్యూల్లో చేతి సంచితో నిలబడితే ... బయటికెప్పుడొస్తామో ఎవరికీ తెలీదాయె. ఈ మధ్యలో ఎన్నేసి తోపులాటలో... వాగ్యుద్ధాలో... ముష్టిఘాతాలో...! చెప్పులు తెగి పోయి... చొక్కాలు చిరిగి...సొమ్మసిల్లి సెలైన్ పెట్టించుకోవాల్సినంత పనైనా...గట్టి పిండం కనక తేరుకొని ... కేజీ ఉల్లిపాయలతో బైట పడినప్పుడు ఎంత ఆనందమో! ప్రపంచాన్నే గెల్చినంత సంతోషం!

అన్ని తిప్పలూ ఉల్లి రుచికి అలవాటు పడిన జిహ్వా కోసమే. అది లేని కూర కూరా కాదు. భోజనం భోజనమూ కాదు. కూరగాయల ధరలు పెరిగిపోయినప్పుడు పచ్చి పులుసుతో కడుపారా భోజనం కానిచ్చేసిన రోజులుండొచ్చు గాక. ఇప్పుడా ఆలోచన చేయాలంటేనే ఒణుకొచ్చేస్తుంది. చింతపండు ధర మాత్రం తక్కువ వుందా! అలా చుక్కల సరసన చేరి పాత సినిమా పాటలకు పాప్ మ్యూజిక్ అద్ది మరీ పాడుకుంటుంటేను. 'కాస్తంత పప్పు ఉడకేసి చారు కాసుకుందాం. ఇంటిల్లిపాది కడుపు నిండా తినొచ్చు' అనుకోవడానికీ లేకపోయె. కందిపప్పుకూ రెక్కలొచ్చి మేఘాల్లో తేలిపోతోంది. మరి వంటకు ముఖ్యమైన మూడు రకాల సరకుల ధరలూ హద్దు లేకుండా పెరిగిపోతుంటే పాలకులకైనా బుద్ధి వుండొద్దూ. 'మనకంటే పెద్ద పెద్ద పదవులూ ఆదాయ మార్గాలూ వున్నాయి. అవి లేని వాళ్ల సంగతేంటన్న' ఆరా వుండొద్దూ. రేషన్ కార్డు మీద నిత్యావసరాలన్నీ అందరికీ ఇవ్వాలన్న వివేచన వుండొద్దూ.

కచ్చితంగా వుండాలి. ఒకవేళ లేకపోతే కల్గించాల్సింది ఓటర్లే. ఏమంటారు! ■

# టపా

## గాలి మేడలు

**మ**నలో మాట 'గాలిలో మేడలు' మన భారతదేశ రాజకీయ పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రజల్ని మాయమాటలతో మభ్యపెట్టి, మోసం చేసి అధికారం చేజిక్కించుకునే రాజకీయ నాయకులు ఉన్నంత కాలం ఈ దుస్థితి మనకు తప్పదనిపిస్తుంది. సామాజిక ఉప్పెన వస్తే తప్ప ఈ దుస్థితి నుంచి మన దేశం బయటపడలేదు.

**రాఘవేంద్ర శ్రీనివాస్,**
**మచిలీ పట్నం (మెయిల్)**

## అన్నీ చదివించాయి

**పూ**ర్తి స్వేచ్ఛనిస్తేనే సినీ రంగంలో రాణించగలరు. టబు కూడా ఆ కోవకు చెందిన నటే. ప్రతిరోజు ఎవరో ఒకరు గాలిలో మేడలు కడుతూనే ఉంటారు. అవి వట్టి మాటలు అని బాగా వివరించారు. పిల్లలకు ఏ కష్టం వచ్చినా తల్లిదే బాధ్యత. ఆ బిడ్డని ప్రయోజకురాలిని చేయడం తల్లిదే బాధ్యత అని మరోసారి గుర్తు చేశారు.సుల్తానా బేగం కథ చాలా బాగుంది. స్త్రీలకు సమాన హక్కులు కావాలని కోరుకుంటున్న ఈ లోకానికి ఇదొక చక్కటి కథగా నిలుస్తుంది. మట్టి కింద పట్టణం ఆసక్తికరంగా ఉంది. ఇలాంటి వ్యాసాలు మరిన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాం.

**సురేష్, విజయనగరం, పినవేమలి.**

## అభినవ మాస్టారు

**'తొ**మ్మిదేళ్లకు మాస్టారు' వ్యాసం బాగుంది. చదువు విలువ గురించి బాగా వివరించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే అందరికి చదువు అవసరం. సెల్ మనిషి జీవితంలో ఒక వస్తువుగా మారిపోయింది.ఎంతలా అంటే సెల్ లేకపోతే అతను ఇక బతకడం అనవసరం అనే స్థితికి చేరుకున్నారు. తనకు తెలియకుండానే విలువైన సమయాన్ని, మిత్రులను దూరం చేసేస్తోంది. సెల్ వల్ల వచ్చే అనర్థాల గురించి కూడా వివరించి వుండాల్సింది.తెలుసా చాలా బాగుంది.మనకు తెలియని విశేషాల గురించి చాలా చక్కగా వివరించారు.

**రాము, ఖాజీపేట, కడప**

## అలనాటి విశేషాలు

**స**ర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఆ కళ్లనే తన చిత్రాలకు కాన్వాసులుగా వాడుకున్నది ఈ అమ్మడు. ప్రపంచం ఎంత వేగంగా మారుతున్నా పల్లెటూర్లు అలాగే ఉన్నాయి అని చెప్పడానికి ఈ వింటేజీ విలేజ్‌లే నిదర్శనం. అలనాటి పల్లెల్లో ఈ విషయాలను చాలా చక్కగా వివరించారు.

**సుధాకర్, చీల్లూరు, తూర్పు గోదావరి.**

## హోల్ సెల్

**మ**నిషి జీవితంలో విడదీయరాని బంధం ఏదైనా ఉందా అంటే అది ఒక్క సెల్ మాత్రమే. ఆధునిక ప్రపంచాన్ని అంది పుచ్చుకున్న విజ్ఞానంలో సెల్ ఒకటి. ఆత్మ హత్యలకు అంతిమ గీతం బాగుంది. ఈ వారం కలర్ పేజీలు బాగున్నాయి. వింత లోకంలో ఇచ్చిన విషయాలన్నీ చదివించాయి. మన దేశంలో పెళ్లి జరిగితే పదార్థాలు చాలా వరకు మిగిలిపోతాయి. ఇక అది చెత్త కుప్పలో వేయడమే తరువాయి. కానీ టర్కీలోని కిలీస్ జంట తమ పెళ్లి సందర్భంగా అన్నార్తులకు సహాయం చేయడం చాలా బాగుంది. ఇలాంటి మరెన్నో విషయాలను ప్రజలకు తెలియజేయాలని ఆశిస్తున్నాను.

**శివ, కడప (మెయిల్)**

**సం**చికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
**మెయిల్ అడ్రస్** : snehaweekly.praja@gmail.com

# ఈ సంచికలో....

## సైకిల్ వాలా పద.. పద..

**కవర్ స్టోరీ** ............ 14

**చ**క్రం ప్రగతికి చిహ్నం. అది జగతి గతిని అమాంతంగా మార్చేసిన ఒక అద్భుత ఆవిష్కారం. పనులను వేగవంతం, సులభతరం చేయడంలో దాని పాత్ర అద్వితీయం. రెండు చక్రాల లాగుడు బళ్లు ఒక తరం ఆలోచన. దాని కొనసాగింపు ఉపాయంగా రంగం మీదికి వచ్చింది సైకిలు. ఈ రెండు చక్రాల వాహనం అనతికాలంలోనే మనుషులతో మమేకం అయిపోయింది! విడదీయరాని బంధంగా మారిపోయింది. తరవాత్తరవాత ఎన్నెన్ని సదుపాయాలూ, సౌకర్యాలూ సమకూరినా... సైకిలు మరుగున పడిపోలేదు. దాని అవసరం, ప్రయోజనం నిత్యనూతనమే! ప్రయాణానికి, వ్యాయామానికీ, ఆరోగ్యా నికీ, పర్యావరణానికీ సైకిలు హితకారి. మొత్తంగా చూస్తే- బహుళ ప్రయోజనకారి.

కార్టూన్ పంచ్ ............ 3

మార్పు ............ 4
కొండంత మనిషి

సాధన ............ 5
95 ఏళ్ల కుర్రాడు

సృజన ............ 10
నా దారి రహదారి

నవ్వుల్ పువ్వుల్ ............ 11

సినిమా కబుర్లు ............ 14
విలక్షణ నటుడు

వింత లోకం ............ 16
'మోడల్' తాత

యువ ............ 17
మంచి నీటి పుస్తకం

కథ ............ 18
ఆర్థిక బంధాలే మానవ సంబంధాలైన వేళ !?

రుచి ............ 21
ఆలూ రింగ్స్

బాలనేస్తాలు ............ 22
బుజ్జి స్టార్

కొత్త పుస్తకాలు ............ 24
అసాధారణ జీవిత కథ 'నేను మలాలా'

చూద్దామా -12
రెండు దశాబ్దాల చరిత్రకు సాక్ష్యం
కాటన్ మ్యూజియం


విద్యాంధ్ర ప్రదేశ్
నిర్మిస్తా.. తమ్ముళ్లూ!
గంగాధర్

# కార్టూన్ పంచ్

నువ్వు
పెద్దోడయ్యాక
ఇస్తాలే!!
YSRCP

ప్రత్యేక
హోదా
YSRCP
డిమాండ్
DUST BIN

కొండను తవ్వి వాళ్లు ఎలుకను పట్టలేదు. ఏనుగులు కూడా లీవిగా నడిచెళ్లే రహదారులను తమ గ్రామాలకు వేశారు. కొండను పిండి గ్రామానికి దారి వేసిన బీహార్‌కు చెందిన దశరథ్ మాంజీ జీవితంపై సినిమా వచ్చింది. మాంజీలానే మరో కొండంత మనిషి ఉన్నారు. ఏడు కొండలను తొలచి తన గ్రామాన్ని మిగతా ప్రపంచంతో కలిపిన మహారాష్ట్రకు చెందిన రాజారామ్ భాప్కరే ఆ ఉక్కు మనిషి.

# కొండంత మనిషి

అదో మారుమూల గ్రామం. ఓ తల్లిని పాము కరిచింది, ఆస్పత్రికి తరలించాలి. ఓ చెల్లికి 9 నెలలు నిండాయి. కాన్పుకు తీసుకెళ్లాలి. ఓ రైతుకు పురుగుమందు వెంటనే కావాలి. పట్నం పోవాలి. ఓ విద్యార్థి చదువు నేర్చాలి. పక్క ఊళ్లో బడికి చేరాలి. ఇదంతా ఎప్పుడు సాధ్యం. మంచి దారి ఉంటే. లేకుంటే కొన్ని ప్రాణాలు గాలిలో వేలాడతాయి. కొందరి భవిష్యత్తులు అక్కడే ఆగిపోతాయి. ఇంత కీలకమైన విషయంపై అధికారులు మిన్నకుంటే. దారి వేసుకునే అవకాశం లేకుండా కొండ రొమ్ము విరిచి అడ్డంగా నిలుచుంటే. ఊళ్లు క్రమంగా ఖాళీ అవుతాయి. వలస బతుకుల యాతనలు ఎక్కువవుతాయి. ఈ పరిస్థితుల నుంచే తమ గ్రామాన్ని బయటపడేశాడు రాజారామ్ భాప్కర్.

**కొండను తవ్వి ... భావికి బాట ..**

మహారాష్ట్రలో మారుమూల గ్రామమైన గుండెగావోన్ కొండల మధ్య బంధీ అయి ఉండేది. పక్క గ్రామం కోలేగావోన్‌కు వెళ్లాలంటే 29 కిలోమీటర్లు కొండల చుట్టూ ప్రదక్షణ చేయాలి. చిన్న అవసరానికి అంత దూరం చుట్టూ తిరగాలి. రాజారామ్ ఓ బడి పంతులు. దారే లేని తన గ్రామంలో ఆయన చెప్పేందుకు బడి ఎందుకుంటుంది. పక్కనున్న కోలేగావోన్‌కు కచ్చితంగా రోజూ ప్రయాణం కట్టాల్సిందే. పోనీ అక్కడికే ఇంటిని మార్చేద్దామంటే పుట్టిపెరిగిన ఊరు. ప్రాణం ఒప్పలేదు. ఇది స్వాతంత్ర్యం వచ్చే నాటి మాట. వచ్చాక తన ఊరి కష్టం తీరుతుంది అని చాలా ఆశపడ్డాడు. అధికారులను కలిసి ఎన్ని విన్నపాలు చేసుకున్నా ఆ చిన్న ఊరికి అంత కొండను తవ్వి దారేసే అవకాశమే లేదని పరోక్షంగా చెప్పేశారు. రాజారామ్‌కు ఏమీ పాలుపోలేదు. అలాగే ప్రయాణాలు కానిస్తున్నాడు. ప్రతి ప్రయాణంలో ఓ గర్భిణి కష్టమో, ఓ విద్యార్థి ఇబ్బందో ఆయన ప్రాణాన్ని తోడేసేవి. ఇక తానే పలుగు, పార పట్టాడు రోజుకు కొద్దిగా తవ్వడం మొదలెట్టాడు. మాస్టారి కష్టం చూసి గ్రామస్తులు బాధపడ్డారు. రోజూలాగే తమ పనుల్లో పడ్డారు. కొన్ని నెలలకు కొన్ని అడుగుల దారి పడింది. అదే ఏళ్ళు గడిచేసరికి వందల మీటర్లకు చేరింది. ఓ మీటరు కొండ తొలగడానికి రాజారామ్ ఒళ్లు హూనమయ్యేది. అటు బడి ఇటు దారి రెండూ



పురోగమిస్తున్న కొద్దీ ఆయన తన రెక్కల కష్టాన్ని లెక్కచేయలేదు. కొన్నాళ్లకు గ్రామంలోని కొందరు తలో చేయి వేశారు. కానీ పనులు మానుకుని వస్తే కడుపు ఖాళీనే అనే సంగతి రాజారామ్‌కు తెలుసు. తన జీతంలో సగం సొమ్మును వారి ఖర్చులకు ఇచ్చేవాడు. అలా తన శక్తికి మించి కష్టించి తన గ్రామాన్ని పక్క ఊరికి కలిపాడు. ఇప్పుడు దూరం 10 కిలోమీటర్లకు తగ్గిపోయింది. 700 మీటర్ల కొండ తొలిస్తేనే ఇంత ప్రయాణం కలిసివస్తే ఆయన 57 ఏళ్లలో 40 కిలోమీటర్ల దూరం రోడ్లను వేశాడు. 7 కొండలను తొలిచాడు. 7 రోడ్లను వేశాడు. తన రిటైర్‌మెంట్ సొమ్మును, పింఛన్ డబ్బును దారి వేసేందుకే ఖర్చుచేశాడు. ఈ లెక్కన ఎంత మేలు జరిగిఉంటుందో ఇట్టే అర్థమవుతుంది. 1999లోనే ఆయన పని పూర్తయ్యింది.

**దారి మార్చిన బతుకు**

ఒకప్పుడు సైకిల్ కూడా వెళ్లని మార్గాల్లో ఇప్పుడు భారీ వాహనాలు చప్పుడు చేస్తున్నాయి. గ్రామానికి దారి అభివృద్ధికి కూడా మార్గాలు వేసింది. ఇప్పటి తరానికి ఒకప్పుడు తమ ఊరికి దారే లేదనే విషయం తెలీకుండానే పాఠశాలలకు టిఫిన్ బాక్సులు కట్టుకుంటున్నారు. కొండ మధ్య దారిలో కేరింతలు కొడుతూ సరదా ప్రయాణాలు చేస్తున్నారు. కాన్పుకు కూతురిని తెచ్చేందుకు తల్లులు మంచి రోజు ఖాయం చేసుకుంటున్నారు. చిన్న చికిత్సకూ పరుగున పట్నం వెళుతున్నారు. ఇదీ రాజారామ్ వేసిన దారి వల్ల మారిన గ్రామం తీరు. చాలా సాదాసీదాగా కనిపించే ఈ భాప్కర్ గురూజీని దైవంలా గ్రామస్తులు కొలుస్తుండటంలో తప్పేముంది. కొన్ని మార్గాలకు ఎవరెవరివో పేర్లు పెడుతుంటారు. వారి పేరు వింటేనే వారి వేయని ఆ దారిన కూడా నడవ బుద్ధి కాదు. ఇలా తమ గ్రామాలకు దార్లు వేసినవారి పేర్లను ఎంత ఉన్నత స్థానాల్లో పెట్టి గౌరవించాలో?

✦

**ఖజీమ్‌కు అసలైన జీవితం 65 ఏళ్లపుడు మొదలైందట. ఎందుకంటే 130 ఏళ్లు హాయిగా బతకగలిగే జీవితంలో మొదటి సగం పూర్తయింది కాబట్టి అంటాడు. ఆ అనుభవాలతో రెండో సగాన్ని ఆస్వాదించాలంటాడు. రిటైర్మెంట్ వయసులో అసలైన జిందగీ అంటాడేమిటి.. ఆ వయసుకు గానీ వచ్చాక తెలీదు అని ఆయన్ను చూసి చాలామంది అంటుంటారు. కానీ ఆయనకు 95 ఏళ్లు.. కనిపించేది 50 దగ్గర. అందుకే అందరూ పొరపాటున ఆ మాటనేస్తారు.**

# 95ఏళ్ల కుర్రాడు

చాలా మంది పెద్దలు అంటుండే మాట నడుస్తూ నడుస్తూనే పోవాలి అని. 65 ఏళ్లు వచ్చేశాక మంచానికే అతుక్కుపోయేంత బలహీనపడేవారు కొందరు. కానీ టర్కీకి చెందిన ఖజీమ్ గుర్బుజ్ అలా కాదు. ఏ మాత్రం వార్ధక్య జాడలు కనిపించని ఈ పెద్దాయన సెంచరీకి దగ్గరలో ఉన్నా ఇంకా పాతికేళ్ల కుర్రాడిలా హుషారుగా కనిపిస్తాడు. అప్పుడు తన జీవన విధానం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఏ ఢోకా లేకుండా సాగిపోతోందని చెబుతాడు. ఖజీమ్ ఓ యోగా గురు. ఇప్పటికీ శిక్షణనిస్తున్నాడు. అతి కష్టతరమైన యోగా భంగిమల్ని చాలా తేలిగ్గా వేసే ఈ కోచ్‌ను చూసి శిష్యులు తెగ సంబరపడిపోతుంటారు. నాట్ పోజ్‌లో 48 గంటల పాటు ఉండగలిగే ఈయన 4-5 నిమిషాలు ఊపిరి బిగపట్టగలడు. ఎంతో ఆరోగ్యంగా ఉండే ఖజీమ్ యవ్వన రహస్యాలను తెలుసుకునేందుకు శిష్యగణంతో పాటు ఆయన గురించిన తెలిసినవారు పోటీ పడుతుంటారు.

**ఖజీమ్ ఆరోగ్య సూత్రాలు**

సామాజిక మాధ్యమాల్లో ఇతడికి భారీగానే అభిమానులు పోగయ్యారు. అలా ఫాలో అయితేనైనా కొన్ని చిట్కాలు తెలుసుకుని తమ యూత్ డేస్‌ను పొడిగించుకోవచ్చనేది వారి ఉద్దేశం. ఇలాంటి ఫాలోవర్ల అందరికీ ఖజీమ్ చెప్పే ఆరోగ్య సూత్రాలివే. ఉదయాన్నే లేవగానే సూర్యుడిని పలకరించే ఖజీమ్ అలా చేయడం ద్వారా బోలెడంత శక్తి శరీరానికి అందుతుందని అంటాడు. అలా కాసేపు గడిచాక ఈత కొడతాడు. అది కూడా స్వచ్ఛమైన గాలి, పరిసరాలు ఉన్న చోట. ఆ తర్వాత ఆలివ్‌లు, మిరపకాయలు, మూలికా తేనీరు, పింటో బీన్స్ సూప్‌తో కూడిన బలవర్ధకమైన మీల్స్ తీసుకుంటాడు. రకరకాల తేనెలు తయారుచేసే ఆయన రోజూ సగం సీసా తేనెను కచ్చితంగా ఖాళీ చేసేస్తాడు. మాంసాహారాన్ని మాత్రం దూరం పెట్టేస్తాడు. అసలు శరీరాన్ని నష్టపరిచేది అదేనని ఆయన ఉద్దేశం. మొక్కల నుంచి అందే ప్రొటీన్లే శ్రేష్ఠమని వివరిస్తాడు. యోగాతో పాటు శృంగారానికి అధిక ప్రాధాన్యతనిస్తాడు. కుర్రాడిగా ఉన్నప్పటిలానే ఆయన జీవితాన్ని ఆస్వాదిస్తుంటాడు. మరో ప్రధానమైన జీవన శైలి గురించి తరచూ ప్రస్తావిస్తుంటాడు. నాలుగు గోడల మధ్య బందీలై, తాజా గాలి చొరబడకుండా ఏసీలకు అలవాటు పడి ఆరోగ్యానికి చేటు తెచ్చుకుంటున్నారంటాడు. తాజా గాలి, సూర్యరశ్మి ఆరోగ్యానికి చాలా ముఖ్యం. రోజూ కచ్చితంగా శారీరక శ్రమ చేయాల్సిందే. అదీ ఆరుబయట అయితే ఇంకా ఉత్తమం. దూరాలు నడవడం, మంచు కురిసే కాలంలోను చాలా దూరం స్కీయింగ్ చేయడం ఖజీమ్‌కు అలవాటు. ఈ విధంగా దినచర్య ఉంటే అందరూ తనలాగే హాయిగా జీవితాన్ని గడుపుతారని, వృద్ధాప్యాన్ని పోస్ట్‌పోన్ చేసుకుంటారని అంటాడు. ఖజీమ్ ఫిట్‌నెస్ గొప్పతనం తెలియాలంటే మరో విషయం కూడా చెప్పితీరాలి. ఆయనకు 41 ఏళ్ల వయసపుడు కార్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా దెబ్బతిన్నాడు. అతడి వెన్ను విరిగింది. నడుం కింది భాగమంతా చచ్చుబడిపోయింది. ఇక జీవితంలో ఆయన నడవలేడని వైద్యులు చెప్పారు. కానీ తనపై తానే ప్రయోగాలు చేసుకుని బలవంతంగా వెన్ను ఎముకలను యథాస్థానంలోకి విరిపించుకున్నాడు. అప్పటి వరకు ఎంతో విలాసంగా ఉన్న జీవితం కాస్త మంచానికే పరిమితమైంది. ఈ ఘటన జీవితం పట్ల తన అభిప్రాయాన్ని మార్చేసిందని చెబుతాడు. తనపై 63 రకాల ప్రయోగాలు చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిచాడని వివరిస్తాడు. యాక్సిడెంట్ తర్వాత 9 నెలలకు తిరిగి కోలుకుని నడవగలిగాడు. మనిషి తలచుకుంటే తన మెదడు శక్తితో చచ్చుబడిన నరాలు, కండరాల్లో స్పందన తెప్పించొచ్చని చెప్పే ఖజీమ్ దేహం తీరు కూడా మోడలింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.



ఒక పొరపాటుకు మాత్రం ఆయన పదే పదే బాధపడుతుంటాడు. తన శరీరంపై చేసుకున్న ప్రయోగాల్లో ఒకటి విఫలమై నడుము భాగంలో బొడిప వచ్చింది. శరీరం కదలకుండా కర్ర ఏదైనా కట్టుకుని ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని చింతిస్తుంటాడు. ఈ చిన్న అసంతృప్తి తప్ప మిగతా అంతా పర్‌ఫెక్ట్ ఖజీమ్ విషయంలో.

# సైకిల్ వాలా

## పద..పద..

చక్రం ప్రగతికి చిహ్నం. అది జగతి గతిని అమాంతంగా మార్చేసిన ఒక అద్భుత ఆవిష్కారం. పనులను వేగవంతం, సులభతరం చేయడంలో దాని పాత్ర అద్వితీయం. రెండు చక్రాల లాగుడు బళ్లు ఒక తరం ఆలోచన. దాని కొనసాగింపు ఉపాయంగా రంగం మీదికి వచ్చింది సైకిలు. ఈ రెండు చక్రాల వాహనం అనతికాలంలోనే మనుషులతో మమేకం అయిపోయింది! విడదీయరాని బంధంగా మారిపోయింది. తరవాత్తరవాత ఎన్నెన్ని సదుపాయాలూ, సౌకర్యాలూ సమకూరినా... సైకిలు మరుగున పడిపోలేదు. దాని అవసరం, ప్రయోజనం నిత్యనూతనమే! ప్రయాణానికి, వ్యాయామానికీ, ఆరోగ్యానికీ, పర్యావరణానికీ సైకిలు హితకారి. మొత్తంగా చూస్తే- బహుళ ప్రయోజనకారి.

- సత్యాజీ
94900 99167

ఒకప్పుడు ఇంట్లో సైకిలు ఉంటే చాలా గొప్ప. సైకిలు నేర్చుకోవడం, తొక్కడం అంటే ఏనుగు ఎక్కినంత సంబరం. సైకిలు చుట్టూ బోలెడు కథలుండేవి. కలలుండేవి. బాల్య, కౌమార దశలు సైకిలుతో ముడిపడి సాగేవి. పోస్టుమ్యాన్ సైకిలు మీదే వచ్చేవాడు. వీధి చివర బెల్లు మోగితే చాలు, వాకిట్లో చూపులు వాలిపోయేవి. హైస్కూలుకు వెళ్లాలంటే సైకిలే సాధనం. రోజూ ఆరేడు కిలోమీటర్ల ప్రయాణం. ముందో వెనకో పుస్తకాల బ్యాగు పెట్టుకుని రయ్‌మని దూసుకుపోవడం గొప్ప అనుభూతి. ఆదివారం పూట సైకిలుకు చక్కా స్నానం చేయించి, అందంగా అలంకరించడం భలే మజాగా ఉండేది. చక్రాల మధ్యన రంగురంగుల ప్లాస్టిక్ పూలు, సీటుకు మెత్తని స్పాంజి కవరు, హ్యాండిల్ బార్‌కు రబ్బరు నగిషీలూ, ట్రింగ్ ట్రింగ్‌మని మోగే బెల్లు, మధ్యన రాడ్డుకు ప్లాస్టిక్ కవరూ ... ఆ అందం అద్భుతంగా ఉండేది. అలాంటి సైకిలును ఇంటి ముందు స్టాండు వేసి నిలబెడితే– మహా కనువిందుగా ఉండేది. మిత్రుల మధ్య సరదా పోటీలూ, ముందు వెళ్లాలనే ఆరాటాలూ, హ్యాండిల్ వదిలేసి నడిపే సాహసాలూ, ఎత్తుపల్లాల రోడ్డులో జాగ్రత్త కోల్పోని వేగాలూ ... చాలా మందికి మెదిలే జ్ఞాపకాలే! ఇప్పటికీ ఇంటికి పేపరు సైకిలు మీదే ఊరేగి వస్తుంది. స్కూలు

పిల్లలకు, చిన్న రైతులకు, ముఠా కార్మికులకు అప్పుడూ ఇప్పుడూ సైకిలే తోడు. అరుదుగా వచ్చే పోస్టుమ్యాన్‌కు సైకిలే ఆసరా. అప్పుడప్పుడు కొంచెం ఖాళీ దొరికే కార్పొరేట్ చదువుల పిల్లలకు సైక్లింగే ఆటవిడుపు. సైకిలు ద్వారా సమకూరే ప్రయోజనాలు చాలా ఎక్కువ. అందుకనే పిల్లలకో, ఏ కొందరికో పరిమితమైన సైకిలు– ఇప్పుడు మళ్లీ వాడకంలోకి వస్తోంది.

**సైకిలు హవా ఎందుకు తగ్గింది?**

మన దేశంలో మధ్య తరగతి చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆదాయానికి తగినట్టు లేదా అంతకుమించినట్టు వినియోగ వస్తుశ్రేణి పెరుగుతూ పోతోంది. దాదాపు పాతికేళ్లుగా మనదేశం అతి పెద్ద వినియోగ మార్కెట్‌గా మారింది. అమెరికా, ఇంగ్లాండు, జపాన్, జర్మనీ లాంటి అనేక దేశాలు కలిసినా మన దేశ జనాభాకు సరితూగవు. ఇక్కడ కొద్దిశాతం అమ్మకాలు జరిగినా కార్పొరేట్ కంపెనీలకు విపరీత లాభం. ఈ వస్తువు వల్ల ప్రయోజనం ఏమిటి? అని ఆచితూచి ఆలోచించటం భారతీయ సమాజపు సహజ లక్షణం. అప్పు చేసి పప్పు కూడు తినరాదు అన్నది ఇక్కడి జీవన సూత్రం. గడిచిన పాతికేళ్లలో ఈ పద్ధతులు పాతవై పోయాయి. రేపటి సంపాదనతో ఈరోజే అనుభవించవచ్చునన్న వినియోగదారీ తత్వం బలంగా చొరబడి, స్థిరపడిపోయింది. ఇంటింటికీ వచ్చిన టీవీలు ఈకాలంలో తెచ్చిన పెద్ద మార్పు ఇది.

ఇప్పుడు వస్తువు అనేది ఒక స్థాయీ చిహ్నంగా మారింది. ఏఏ వస్తువులు, ఏఏ బ్రాండ్లు, ఏఏ మోడళ్లు వాడుతున్నాం అనేది ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. కొన్ని వస్తువులు వాడడం లేదా కొన్ని వస్తువులు వాడకపోవడం అనేది చిన్నతనానికి చిహ్నంగా మారిపోయింది. ప్రయాణ సాధనంగా సైకిలు మాయమైపోవటానికి ఇలాంటి చిన్నచూపు కూడా ఒక కారణం.

**సైకిళ్ల దేశం నెదర్లాండ్స్**

కానీ, చాలా సమాజాలు సైకిలుకు అమిత ప్రాధాన్యం ఇస్తున్నాయి. రోజువారీ పనుల్లో ఒక భాగం చేసుకున్నాయి. నెదర్లాండ్స్‌లో సైకిళ్లను విస్తారంగా వాడతారు. ఆ దేశ పౌరులు సగటున 27 ప్రయాణాలు చేస్తే, అందులో 25 ప్రయాణాలకు సైకిలే వాహకం. సైకిలు వాడకంపై అక్కడ 1970 ప్రాంతంలో పెద్ద ఉద్యమమే సాగింది. 1971లో ఆ దేశంలో 3 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మోటారు వాహనాల కారణంగా చనిపోయారు. అందులో 450 మంది పిల్లలు. విక్ లాంగెన్‌హఫ్ అనే జర్నలిస్టు తన బిడ్డను ఇలాగే కోల్పోయాడు. 'పిల్లల హత్యలను నివారించండి..' పేరిట ఆయన రాసిన వ్యాసం శీర్షికే సైకిలు ఉద్యమానికి నినాదమైంది. 1973లో నెలకొన్న చమురు సంక్షోభం కూడా ఈ ఉద్యమానికి బలం చేకూర్చింది. సైకిలు వాడడంవల్ల ప్రమాదాలు నివారించవచ్చు. ఇంధనం పొదుపు చేయవచ్చు. పర్యావరణాన్నీ కాపాడవచ్చు. ఇది నెదర్లాండ్స్ జాతీయ విధానంగా మారిపోయింది. సైకిళ్లకు ప్రత్యేక రహదారులు నిర్మించారు. కూడళ్లలో సైకిళ్ల

## సైక్లింగ్‌తో లాభాలెన్నో ...!

- సైకిల్ వాడకం మన సమాజానికి కొత్తేమీ కాదు. కాలుష్యం, స్థూలకాయ సమస్యా వేగంగా పెరుగుతున్న మన దేశంలో సైకిళ్లను విరివిగా ఉపయోగించాల్సిన అవసరం చాలా ఉంది.
- సైకిల్ వాడకంతో ఏరోబిక్ వ్యాయామం లభిస్తుంది. వ్యాయామం వల్ల లభించే అన్ని ప్రయోజనాలూ సమకూరతాయి.
- వారంలో 5 రోజులు, రోజుకు 15 నిమిషాల పాటు సైకిలు తొక్కడం వల్ల ఏడాదిలో 4 కేజీల కొవ్వును కరిగించుకోవచ్చు.
- మహిళలు రోజూ 30 నిమిషాలు సైకిలు తొక్కడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.
- వారంలో 30 కిలోమీటర్ల దూరం సైకిలు తొక్కడం వల్ల గుండెజబ్బులు 50 శాతం తగ్గుతాయి.
- సైకిల్ వాడకం మధుమేహం, అధిక రక్తపోటు లాంటి వాటిని నిరోధిస్తుంది. వాటి తీవ్రతను తగ్గిస్తుంది.
- సైకిలును ఉపయోగించడం వల్ల కాలి కండరాలు బలపడతాయి. నడుము నొప్పుల నుంచి విముక్తి కలుగుతుంది.
- శరీరం, మెదడు సమతుల్యంతో పనిచేస్తాయి. భౌతిక, భావావేశాలు తగ్గుతాయి. నిరాశా నిస్పృహలు, ఒత్తిడీ దరిచేరవు.
- సైకిలు వాడకం ద్వారా పెట్రోలు లాంటి ఇంధనాల వాడకం తగ్గుతుంది. శబ్ద, వాయు కాలుష్య సమస్యలు తగ్గుతాయి. ఆ విధంగా వాతావరణాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు.

**ఇదీ... సైకిలు చరిత్ర**

**వీధుల్లో వింత వాహనం**

**1813**లో ఒకరోజు జర్మనీలో బారన్ కార్ల్ వాన్ డ్రాయిస్ అనే 28 ఏళ్ల యువకుడు వీధుల్లో వింత వాహనంపై ప్రయాణం చేశాడు. ఈ వాహనంలో ఒక కొయ్య చట్రం ఉంది. మధ్యలో కూర్చోవటానికి సీటు ఉంది. ఒకదాని వెనక ఒకటి రెండు చక్రాలున్నాయి. అతడు సీటుపై కూర్చుని, కాళ్ళను నేలపై నెట్టుకుంటూ ముందుకు సాగాడు. చేతులు ఇనుప కడ్డీలపై ఉంచాడు. ముందు చక్రానికి ఉన్న కొయ్య కడ్డీని చేతితో ఎటు తిప్పితే అది అటు వెళుతుంది. జనం అతడిని వింతగా చూశారు. అదొక పిచ్చి చేష్ట అనుకున్నారు. 16 గంటల్లో వెళ్ళే దూరాన్ని కొత్త వాహనం సాయంతో 4 గంటల్లో వెళ్ళగలిగాడు. ఈ ప్రదర్శన కారణంగా అతడి ఉద్యోగం పోయింది. అయితే, ఈ ప్రయత్నం ఫ్రాన్స్, ఇంగ్లాండు దేశాల దృష్టిని ఆకర్షించింది.

**మాక్మిలన్ మరో ప్రయోగం**

**20** ఏళ్ల తరువాత మాక్మిలన్ అనే యువకుడు ఈ నమూనాను కొంత మెరుగుపర్చాడు. వెనకచక్రం ఇరుసుకి రెండు కాంక్‌లను అమర్చి, వాటిని రెండు పొడుగాటి తులాదండాలకు కలిపాడు. వీటిని కాళ్ళతో తోసినపుడు వాహనం ముందుకు కదులు తుంది. మాక్మిలన్‌ఈ వాహనంపై డంఫ్రీస్ నుంచి గ్లాస్కో వరకూ 40 మైళ్ళ దూరం ప్రయాణం చేశాడు.

## ఉద్యమంగానూ.. ఉద్యమంలోనూ ...

కమ్యూనిస్టు దేశాలు సహజంగానే నిరాడంబరతకు, పర్యావరణానికీ ప్రాధాన్యం ఇస్తాయి. ప్రజాధనం వృథా కాకుండా చూస్తాయి. క్యూబా ఈ విషయంలో గొప్ప కృషి చేసింది. ఇంధనంపై అమెరికా ఆంక్షలు విధించినప్పుడు దేశంలోని ప్రజలంతా ఒక ఉద్యమంగా సైకిలుపైనే ప్రయాణం చేశారు. ప్రతి ఒక్కరూ సైకిలు వాడడం ఒక జీవన విధానంగా మార్చుకున్నారు. కొరియాలో సైకిలు నేర్పడం, తొక్కించటం ఒక ఉద్యమంగా సాగింది. మహిళలు కూడా సైకిలు తొక్కవచ్చు అని మన రాష్ట్రంలో ప్రాచుర్యంలోకి తెచ్చారు ప్రముఖ మహిళా నేత మోటూరు ఉదయం. 40 దశకంలో ఆమె విజయవాడలో సైకిలు తొక్కడం ఒక సాహసం, ఒక ఆశ్చర్యం!

సైకిలు సామాన్యులకు దగ్గరగా ఉండే వాహనం. అందుకనే వామపక్షాలు, ప్రజా సంఘాలూ ప్రజల సమస్యలపై అధ్యయనం చేయటానికి, ప్రజల్లో మమేకం కావటానికీ తరచూ సైకిలు యాత్రలను చేపడతాయి. కులవివక్ష పోరాట సంఘం పేరిట బివి రాఘవులు చేపట్టిన సైకిలు యాత్ర అప్పట్లో గొప్ప చర్చకు తెర తీసింది. సమగ్రాభివృద్ధి పేరిట రాష్ట్రంలో అనేక జిల్లాల్లో సాగిన అధ్యయన యాత్రలకు కూడా సైకిలే సాధనం. 1963లో ఇస్రో మొట్టమొదటి రాకెట్‌ని సైకిలు మీదనే ప్రయోగ స్థలి వరకూ తీసుకెళ్లారు.

వెళుతున్నప్పుడు కార్లు ఆగుతాయి. స్కూళ్లు, షాపులు, మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలు ... ఇలా అన్నిటా ప్రత్యేకంగా సైకిలు స్టాండ్లు ఉంటాయి. చాలా నగరాల్లోని రోడ్లు సైకిళ్లతో కనిపిస్తాయి. కార్లు అప్పుడప్పుడు అతిథుల్లా తారసపడతాయి. స్కూల్లో సైకిలు గురించి పాఠాలు ఉంటాయి. సైకిలు నిర్మాణం, వినియోగం, ఉపయోగం, ట్రాఫిక్ నిబంధనలు .. ఇలా అన్నింటినీ విద్యార్థి దశలో నేర్పిస్తారు. అందుకనే ఆ దేశంలో నూటికి 99 మంది సైకిళ్లను వినియోగిస్తారు.

**ఇంకా ఇతర దేశాల్లో ...**

ఐరోపాలో ఇంకా చాలా దేశాలు సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. బెల్జియంలో సైక్లింగ్ జాతీయ క్రీడ. అక్కడ సైకిలును చాలా ఇష్టంగా వాడతారు. స్విట్జర్లాండ్‌లో ఉద్యోగులు సైకిళ్ల మీదే ఆఫీసుకు వెళతారు. పర్యావరణ పరిరక్షణ పట్ల స్విస్ ప్రభుత్వం చాలా ఎక్కువ శ్రద్ధ చూపిస్తోంది. సైకిళ్ల వాడకంపై తరచూ ప్రచారం నిర్వహిస్తోంది. జపాన్‌లో ఏడాదికి 20 లక్షలకు పైగా సైకిళ్లు అమ్ముడవుతాయి. కారు ఉన్నవారు కూడా దగ్గరి ప్రయాణాలకు సైకిలు వినియోగిస్తారు. ఫిన్లాండులో టీవీ సెట్ల కన్నా సైకిళ్లు ఎక్కువ. వసంతకాలంలో సైకిళ్ల ప్రయాణం ఒక జాతరలా సాగుతుంది అక్కడ. జర్మనీలో మనవలూ, తాతయ్యలు, బామ్మలూ పోటీ పడి మరీ సైకిలు తొక్కుతారు. అది వారికి రోజువారీ ఆటవిడుపు. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో 37 శాతం ప్రయాణాలు సైకిలు మీదే సాగుతాయి. అక్కడ ఉచిత సైకిలు స్టాండ్లు ఉంటాయి. అవసరమైనవారు సైకిలు తీసుకొని ప్రయాణం చేయవచ్చు. గమ్యం చేరాక దగ్గర్లోని మరొక స్టాండ్లో దానిని అప్పగించవచ్చు. కోపెన్ హగెన్ నగరంలో కార్ల గరిష్ఠ వేగం 27 కిలోమీటర్లకు పరిమితం. సైకిలు ప్రయాణాలకు ఇబ్బంది కలక్కుండా ఈ జాగ్రత్త. అమెరికా, ఇంగ్లాండులలో కూడా సైకిలు వాడకం ఎక్కువగానే ఉంది.

**ఆరోగ్యానికీ, పర్యావరణానికీ ...**

సైకిలును విరివిగా వాడుతున్న సమాజాలు ఆరోగ్యం, పర్యావరణం అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని అర్థం. సైకిలు ఒక సాధారణమైన, చౌకైన, సులభతరమైన ప్రయాణ వాహనం. ఇంధనం అవసరం లేదు. ఏవిధమైన కాలుష్యాన్నీ ఉత్పన్నం చేయదు. అంతే కాదు; అది సంపూర్ణ వ్యాయామ సాధనం. ఒక గంట పాటు సైకిలు తొక్కితే 600 క్యాలరీలు ఖర్చవుతాయి. ఊబకాయం రాకుండా చేస్తుంది. ఇంకా ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయి. పర్యావరణానికి ఎలాంటి హానీ కలగదు. మోటారు బైకులతో పోలిస్తే– సైకిలు కొనటానికి, నిర్వహణకు అయ్యే ఖర్చు కూడా తక్కువే!

మన దేశంలో మామూలుగా అయితే, ఊబకాయ సమస్య తక్కువ. ఈ పాతికేళ్ల ప్రపంచీకరణ విధానాలతో ఆహార విహారాల్లో చాలా

### పెడల్స్ వచ్చాయి

**ప**దేళ్ల తరువాత జర్మనీకి చెందిన ఫిలిప్ హెనిరిక్ ఫిషర్ అనే మెకానిక్ మరికొన్ని మార్పులు చేశాడు. ముందు చక్రానికి రెండువైపులా పెడల్స్ అమర్చాడు. దానివల్ల వాహనం నెమ్మదిగా, అవిచ్ఛిన్నంగా చలిస్తుంది. కానీ, చలిస్తున్నంత వరకూ వాహనం ఎందుకు పడిపోదో మాక్మిలన్‌కి గానీ, ఫిషర్‌కి తెలీదు. వాహన వేగం పెరిగేకొద్దీ దాని స్థిరత్వం పెరుగుతుంది. ఇది సైన్సు సూత్రం.



### తొలి సైకిలు కర్మాగారం

**మొ**ట్టమొదటి సైకిలు కర్మాగారం నెలకొల్పిన ఘనత ఎర్నస్ట్ మికాక్స్ అనే ఫ్రాన్సు దేశీయుడిది. ఫిషర్ నమూనా ప్రకారం సైకిళ్లు తయారుచేశాడు. 1870 ప్రాంతంలో ఈ నమూనా ప్రజాదరణ పొందింది. వాహన వేగం ముందు చక్రం తిరగటంపై ఆధారపడటం వల్ల దాని పరిమాణాన్ని ఎక్కువ చేసి, వెనక చక్రం పరిమాణం తగ్గించారు. ఈ వాహనాన్ని ఎక్కడం, దిగడం ఒక సర్కస్‌లా ఉండేది.

## సైకిలు ఎక్కువగా వినియోగించే

**మొదటి 10 దేశాలు**

| దేశం | జనాభా | సైకిళ్లు | శాతం |
|---|---|---|---|
| 1. నెదర్లాండ్స్ | 16.65 కోట్లు | 16.50 కోట్లు | 99.1 |
| 2. డెన్మార్క్ | 55 లక్షలు | 45 లక్షలు | 80.1 |
| 3. జర్మనీ | 8.18 కోట్లు | 6.20 కోట్లు | 75.8 |
| 4. స్వీడన్ | 94 లక్షలు | 60 లక్షలు | 63.7 |
| 5. నార్వే | 49 లక్షలు | 30 లక్షలు | 60.7 |
| 6. ఫిన్లాండ్ | 53 లక్షలు | 32 లక్షలు | 60.4 |
| 7. జపాన్ | 12.73 కోట్లు | 7.25 కోట్లు | 56.9 |
| 8. స్విట్జర్లాండ్ | 77.82 లక్షలు | 38 లక్షలు | 48.8 |
| 9. బెల్జియం | 1.08 కోట్లు | 52 లక్షలు | 48.0 |
| 10. చైనా | 134 కోట్లు | 50 కోట్లు | 37.2 |

దేశ జనాభాలో సైకిలు వినియోగించేవారి శాతం నెదర్లాండ్స్‌లో ఎక్కువైతే, అత్యధిక సైకిళ్లు ఉన్న దేశం మాత్రం చైనా. ప్రపంచం మొత్తం సైకిళ్లలో సగం ఆ దేశంలోనే ఉన్నాయి.

మార్పులు వచ్చాయి. ఫలితంగా ఊబకాయుల శాతం వేగంగా పెరుగుతున్న దేశాల్లో మనమూ ఉన్నాం. శారీరక శ్రమ తగ్గిన లేదా లేకుండా పోయిన తరగతుల్లో సంబంధిత ఆరోగ్య సమస్యలూ పెరుగుతున్నాయి. మరోవైపున ఎగువ మధ్య తరగతి, దాని ప్రభావిత సెక్షన్లలో సౌందర్య స్పృహ పెరిగింది. జిమ్‌లూ, స్పా సెంటర్లూ, పార్లర్లూ విస్తారంగా వచ్చాయి. చాలా ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, వ్యాయామానికీ సైక్లింగ్ మంచి మార్గం అనే చర్చ ప్రారంభమైంది. దీంతో, ఇప్పుడు సైకిలు మళ్లీ విశేష ప్రాచుర్యం పొందుతుంది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు కోణంలోంచి కూడా సైక్లింగ్‌ని ప్రోత్సహిస్తున్నారు.

**ప్రభుత్వ ప్రోత్సాహంతోనే పరుగు!**

మనదేశంలో సైకిల్ క్లబ్బులు పెరుగుతున్నాయి. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం వంటి సంస్థలు వారానికి ఒకరోజు మోటారు వాహనాలు వాడరాదనే నిబంధన అమలు చేస్తున్నాయి. ఇలాంటి ఆలోచన నెమ్మది నెమ్మదిగా విస్తరించే అవకాశం ఉంది.

అయితే, ఇలాంటివి వ్యక్తుల తపనకే పరిమితమైతే, పూర్తి ఫలితాలు రావు. ప్రభుత్వాల విధానంలోనూ భాగం కావాలి. సైక్లింగ్‌ను ప్రోత్సహించే పద్ధతులు అనుసరించాలి. రోడ్ల నిర్మాణంలో, పార్కింగులో, ట్రాఫిక్ నిబంధనల్లో సమూలమైన మార్పులు తేవాలి. ప్రతి నగరంలో, పట్టణంలో సైకిలు జోన్లు ఏర్పాటు చేయాలి. మన జీవన విధానంలో సైకిలు ఒక భాగమైతే- వ్యాయామానికి వ్యాయామం.. ఆరోగ్యానికి ఆరోగ్యం. ఆరోగ్యమే మహా భాగ్యమైనప్పుడు- సైకిలుతో ఇక అందరూ శ్రీమంతులే!

✦

### నిరాడంబర చిహ్నం

- సైకిలు అంటే కమ్యూనిస్టు మహానేత పుచ్చలపల్లి సుందరయ్య గుర్తుకొస్తారు. నిరాడంబరతకు నిలువుటద్దం ఆయన. ప్రజల్లోకి, పార్లమెంటుకీ సైకిలు మీద వెళ్లిన ఘనత ఆయనిది.
- ఎన్టీ రామారావు 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, సైకిలు గుర్తుపై పోటీ చేసి, ప్రభంజనం సృష్టించారు.
- ఇక సినిమాల్లో సైకిలు పాత్ర సరేసరి! 1948లో వచ్చిన ఇటాలియన్ సినిమా 'బైస్కిల్ థీవ్స్'లో సైకిలు ఒక జీవన సాధనం. గొప్ప ఆదరణ పొందింది ఈ సినిమా. ఆ సినిమా ప్రభావంతోనే సత్యజిత్ రే వాస్తవిక కథాకథనాలు, చిత్రీకరణతో పథేర్ పాంచాలీ తీశారట!
- మర్యాద రామన్న సినిమాలో సైకిలు మొదట్లోనూ, ఆఖరి సీన్లోనూ కీలకంగా కనిపిస్తుంది. అది రవితేజ టోన్‌తో మాట్లాడే పాత్రలా ఉండడం మరింత ఆకర్షణీయం.
- శ్రీమంతుడు సినిమాలో మహేష్‌బాబు సైకిలు మీద కనపడడం తాజా ఆకర్షణ.
- మనదేశంలో రెండు ప్రాంతీయ పార్టీలకు సైకిలు ఎన్నికల గుర్తుగా ఉంది : 1. తెలుగుదేశం 2. సమాజ్‌వాదీ పార్టీ.

**వేగంగా వెళ్లే సైకిలు**

**సై**కిలుని మరింత చిన్నగా, వేగంగా పోయే విధంగా ఇంగ్లండుకు చెందిన లాసన్ రూపొందించాడు. రెండు చక్రాల మధ్య క్రాంక్‌ని, పెడల్‌ని అమర్చింది ఇతడే. స్వీడన్‌కి చెందిన హాన్స్ రెనాల్డ్ సైకిల్ చైను వాడాడు. క్రమంగా చక్రాలకు స్పోక్‌లు, బాల్ బేరింగులు, గేర్లు, కూర్చోవడానికి స్ప్రింగ్ సీటు ఒక్కొక్కటిగా అమరాయి. 1890లో సైకిళ్లు పెద్దఎత్తున తయారయ్యాయి. అప్పట్లో చక్రాలకు రబ్బరు టైర్లను వాడేవారు.

**గాలిటైర్లతో మరింత వేగం**

**టై**ర్లను కనుగొన్న ఘనత స్కాట్లాండుకు చెందిన పశు వైద్యుడు జాన్ బాయిడ్ డన్‌లప్‌కు దక్కింది. సైకిలు పందెంలో తనను గెలిచేలా చేయాలని అతడి కొడుకు మారాం చేశాడు. డాక్టర్ డన్లప్ చెట్లకు నీరు పట్టడా నికి ఉపయోగించే హోసు గొట్టాన్ని రెండు భాగాలుగా చేసి, వాటిని చక్రాలకు అతికిం చాడు. పంపు సహాయంతో గాలి నింపాడు. దీంతో, ఆ అబ్బాయి పందెంలో అందరికన్నా ముందుకు దూసుకుపోయాడు. ఇది పత్రికల్లో వచ్చింది. డన్‌లప్‌తో కలిసి ఒక ఐర్లండ్ పారిశ్రామికవేత్త టైర్ల తయారీ పరిశ్రమ ప్రారంభించాడు.

**ఇక పరుగే పరుగు**

**గాలి** టైర్లు వచ్చాక సైకిలు వాడకం పరుగందుకుంది. ప్రజలు సైకిలుని విస్తృతంగా వాడటం మొదలెట్టారు. 1888లో ప్రపంచంలోని మొత్తం సైకిళ్ల సంఖ్య 3 లక్షలయితే, 1975 నాటికి ఆ సంఖ్య 7.5 కోట్లు.. ఇప్పుడైతే అక్షరాలా 100 కోట్లు!

సృజన

**ఊరికి దూరంగా కారు ఆగిపోతే. మరో వాహనం జాడ లేని ప్రాంతంలో టైరు పేలిపోతే. దోపిడీ దొంగలు, క్రూర మృగాలు, అల్లరి గుంపుల భయంతో పాటు అత్యవసర పనులకు ఆటంకమూ కలుగుతుంది. ఒక్కోసారి టైర్లు పంక్చరై యాక్సిడెంట్లలో ప్రాణాలు పోయిన కేసులు ఉన్నాయి. ఈ పరిస్థితిని ఊహించడానికే చాలా భయంకరంగా ఉంటుంది. వీటి నుంచే బెంగళూరు వాహనదారులను బయట పడేస్తున్నాడు బెనెడిక్ట్ జీవకుమార్. రోడ్డు మీద ఉండే మేకులు, కొయ్యల వంటి వాటిని ఏరిపారేస్తున్నాడు.**

# నా దారి.. రహదారి

2012లో ఆఫీసుకు వెళ్తున్న బెనెడిక్ట్ జీవకుమార్ కారుకు పంక్చరైంది. మామూలుగా అయితే ఇది చాలా చిన్న ఘటన. వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి చూసుకోగా టైరుకు కొత్త మేకు గుచ్చుకుని ఉంది. ఆ ప్రాంతంలో అలాంటి మేకులు చాలానే కనిపించాయి. కానీ దరిదాపుల్లో ఎటువంటి నిర్మాణ పనుల జాడలు గానీ, నివాస ప్రాంతాల ఆనవాళ్లు గానీ లేవు. ఒంటరిగా ఉన్న బెనెడిక్ట్ కాసేపు అక్కడే నిరీక్షించాడు. చాలా భయానికి లోనయ్యాడు. ఏ వాహనమూ అటుగా రాకపోవడంతో కారును వదిలి మెకానిక్ కోసం కొంత దూరం నడిచాడు. అలా 500 మీటర్లు వెళ్లాడో లేదో రోడ్డు పక్కగా ఆరు మెకానిక్ షాపులు కనిపించాయి. ఆ రోజుకు మాత్రం హమ్మయ్య అనుకుని కారు రిపేరు చేయించుకుని బయటపడ్డాడు. అదే రూట్లో మరో సారి వెళ్లిన బెనెడిక్ట్‌కు మరో వాహనం పంక్చరై రోడ్డు పక్కన కనిపించింది. అలా చాలా రోజుల వరకు ఇలాంటి దృశ్యాలనే చూడటంతో ఆయనకు సందేహం కలిగింది. కానీ, ఆ విషయంపై ఎక్కువగా ఆలోచించలేదు.

**విషయం ఇలా పంక్చరైంది..**

ఈ సిస్టమ్స్ ఇంజినీర్ కొన్నాళ్ల తర్వాత ఆరోగ్యం కోసం కారును వదిలి సైకిల్‌పై తిరగడం మొదలెట్టాడు. అప్పుడు స్పష్టంగా ఆ రహదారుల్లో ఏం జరుగుతుందో ఆయనకు అర్థమైంది. ప్రతిరోజూ మేకులు కనిపిస్తున్నా వీటిని ఎందుకు శుభ్రం చేయడం లేదా అని ఆలోచించాడు. తానే ఓ పరికరాన్ని తయారు చేసుకుని కనిపించిన మేకులన్నీ తీసేయడం మొదలెట్టాడు. చిన్నారులు, కుటుంబాలతో వెళ్లే వాహనదారులకు ఇటువంటి పంక్చర్లు, బ్రేకింగ్‌లు పెద్ద కష్టాన్ని కలిగిస్తాయని తానే స్వచ్ఛందంగా రోడ్లను పంక్చర్ ప్రూఫ్‌గా చేయడానికి పూనుకున్నాడు. ఓ ఫిషింగ్ రాడ్‌కు అయస్కాంతాన్ని అమర్చి రోడ్ల నుంచి మేకుల వంటి ఇనుప వస్తువులను ఏరిపారేయడం ప్రారంభించాడు. తాను ఉదయం అలా వాటన్నింటినీ ఏరిపారేసినా సాయంత్రానికి తాజాగా కొత్త మేకులు కనిపించేవి. కొన్ని రోజుల తర్వాత ఆయనకు స్పష్టమైంది. వాటిని కావాలని పంక్చర్ షాపుల వాళ్లే రోడ్లపై వేస్తున్నారని. పోలీసులకు, కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆయన అనుమానం నిజమై గత ఏడాది ఓ మెకానిక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో ఈ సమస్య సమసిపోయిందని బెనెడిక్ట్ అనుకున్నాడు. తిరిగి ఓ నెలకు మళ్లీ మేకులు రోడ్డుపై కనిపించాయి. మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేయడం వాళ్లు కొందరిని అదుపులోకి తీసుకోవడం, కొన్ని రోజుల తర్వాత మళ్లీ రోడ్డుపై మేకులు కనిపించడం ఇలా పాత కథే పునరావృతం అయ్యేది. ఇక ఈ సమస్యపై పెద్ద ఎత్తున ప్రచారం లేవ దీశాడు బెనెడిక్ట్. సామాజిక మాధ్యమా లను ఉపయోగించి 'మై రోడ్ ... మై రెస్పాన్సిబిలిటీ' (నా రహదారి నా బాధ్యత) అనే నినాదాన్ని ప్రజల్లో తీసుకెళ్లాడు. ఏడాది నుంచి క్రమం తప్పకుండా తాను వెళ్లే దారిలోని మేకులను ఏరిపారేస్తూ వాటి ఫొటోల్ని అప్‌డేట్ చేయడం మొదలెట్టాడు.

బెంగళూరులోని చాలా రోడ్లలో ఇలాంటి సమస్యే ఉందని మరికొందరు రీపోస్టులు చేస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. పెడదారి పట్టిన మెకానిక్‌ల ఆగడాలు తగ్గాయి. అయితే, బెనెడిక్ట్ దీంతో సరిపెట్టుకోవడం లేదు. రోడ్లను ఊడ్చే అధునాతన సాంకేతిక మేగ్నటిక్ స్వీపింగ్ మెషీన్లను వినియోగించాలని అధికారులను కోరుతున్నాడు. రోడ్లపై ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ టీవీ కెమెరాలతో పర్యవేక్షిం చాలని వినతి పత్రం అందించాడు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తాను అలాగే తన పనిని ప్రచారాన్ని కొనసాగిస్తానని అంటున్నాడు. ఇప్పటివరకు 9 కేజీల మేకులను ఏరిపారేశాడని, ఓ రోజైతే వందల మేకులు రోడ్డుపై కనిపించాయని లెక్కలు చెబుతున్నాడు. తన గంట ప్రయాణంలో 15 నుంచి 20 మేకులు ఏరిపారేస్తుంటాడు. ఓ ప్రయాణంలో అలా 500 మేకుల్ని తొలగించాల్సివచ్చిందని ఇదంతా తన పనిని అడ్డుకోవడానికి కష్టం పెంచే ఉద్దేశమే అని అయినా వెనకడుగు వేయనని ఆయన అంటున్నాడు. తనకు కలిగిన కష్టం మరెవరికీ కలగగూడదనేది ఆయన సంకల్పానికి కారణం. రోడ్డుపై అడ్డంగా రాళ్లు పడి ఉంటే మనకెందుకులే అని తప్పుకుపోయేవారు ఎక్కువవుతున్న కాలంలో బెనెడిక్ట్ లాంటి వ్యక్తుల చొరవ, కృషి స్ఫూర్తిదాయకం. ఇలాంటి రోడ్లు, పంక్చర్ షాపుల గురించి మన ఊళ్లలోను వింటుంటాం. బెనెడిక్ట్‌లా స్పందిస్తే ఇలాంటి ఆగడాలను అడ్డుకోవచ్చు.

# నవ్వుల్ – పువ్వుల్

## మంచిది

**క్యా**లెండర్ కోసం బజారుకెళ్ళాడు రాము.

**యజ**మాని క్యాలెండర్లు చూపిస్తుంటే ప్రతీ దాన్నీ వద్దంటూ "ఇంకాస్త మంచిదివ్వండి" అంటున్నాడు.

**"నీ** దృష్టిలో మంచిదంటే ఏంటి?" విసుగ్గా అడిగాడు యజమాని.

"**అం**టే స్కూలుకు సెలవులు బాగా ఇచ్చేలా ఎర్ర రంగు గళ్ళు ఎక్కువ వుండాలి"

## ఎలా సార్ !

**ఉపాధ్యాయుడు:** ఏరా, పాలపిట్ట మీద వ్యాసం రాయమంటే రాయలేదేం?

**రమేష్:** అది ఎగిరిపోయింది సార్. అందుకే రాయలేకపోయాను.

## దొందూ దొందే

**ఇ**ద్దరు స్నేహితులు పందెం పెట్టుకుని టెన్నిస్ ఆడుతున్నారు. ఆట చివరికొచ్చాక బంతి కనిపించకుండా పోయింది. కాసేపు వెతికాక

**"బా**ల్ లేదు కాబట్టి ఆట క్యాన్సిల్" అన్నాడు ఓడిపోయేట్టున్న రాము.

**"ఇ**దిగో దొరికింది" తన జేబులో బంతిని పడేసి అరిచాడు సోము.

**"బో**డి యాభై రూపాయల కోసం నన్ను మోసం చేస్తావా?"

**"ని**జం రా నాకు దొరికింది"

**"ఎ**లా దొరుకుతుంది? నేను దాని మీద నిల్చుంటే?"

## రైల్వే ట్రాక్

**అనిల్:** కట్నంగా కారు ఇస్తే కానీ మన పెళ్ళి చేయనని మా నాన్న చెప్పారు.

**అనిత:** బోడి కారెందుకు? మా నాన్నతో చెప్పి రైలే ఇప్పిస్తాను. మీ నాన్నని రైల్వే ట్రాక్ వేయించుకోమని చెప్పు..!



## మొహం చూపించకు

**చిన్న వెంగళప్ప:** అమ్మా! నేను స్కూలుకెళ్తున్నాను. ఒక తువ్వాలు ఇవ్వు!

**తల్లి:** అదెందుకురా?

**చిన్న వెంగళప్ప:** ఈ రోజే పరీక్ష ఫలితాలు తెలిసేది. ఫెయిలైతే నా ముఖం చూపించవద్దని నాన్న చెప్పారు. అందుకే ముఖం మీద తువ్వాలు కప్పుకుని వస్తాను!

## విషాద గీతం

**ఒక** అబ్బాయి ఎఫ్.ఎమ్.రేడియో స్టేషన్ కి కాల్ చేసి.... సార్ నాకు ఒక పర్స్ దొరికింది. అందులో రూ.15000, క్రెడిట్ కార్డ్ ఇంకా సికింద్రాబాద్‌లో ఉండే మిస్టర్ బాబు ఐడి కార్డ్ ఉన్నాయి అన్నాడు.

**రేడియో జాకీ:** వావ్ ఎంత నిజాయితీపరుడివి..ఐతే ఆ పర్స్‌ని రాజు గారికి ఇవ్వాలనుకుంటున్నావన్న మాట అన్నాడు.

**అబ్బాయి:** కాదండి..రాజు గారి కోసం ఒక విషాద గీతాన్ని వినిపించాల్సిందిగా కోరుకుంటున్నాను.

## ఆటగాడు

'**మం**చి ఆటగాడు అని చెపితే ఏ పెద్ద ప్లేయరో అని పెళ్ళి చేసుకున్నా. తీరా చేసుకున్న తరువాత తెలిసింది'. విచారంగా అంది సుమలత.

"**ఏ**మైంది? అతను ఆటగాడు కాదా" అడిగింది శ్రీదేవి.

"**ఆ**టగాడే..పేకాట ప్లేయరంట...' ఏడ్చింది సుమలత.

# రెండు శతాబ్దాల చరితకు సాక్ష్యం

**నదీ జలాలు వృథా కాకుండా ప్రాజెక్టులు నిర్మించుకుంటున్నామని అందరికీ తెలుసు. కానీ... ఇప్పుడున్న వనరులు ఏమీ లేని కాలంలోనే... అంటే సుమారు రెండు శతాబ్దాల క్రితమే జలం జనం కోసం ఉపయోగపడాలని, అతివృష్టి, అనావృష్టులకు జనం బలి కాకూడదని పరితపించిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్. ఆయన కృషికి, అప్పటి ఇంజనీరింగ్ నైపుణ్యానికి, ఆంగ్లేయులు, భారతీయులు సమిష్టిగా శ్రమించి గోదావరి జలాలతో ఆంధ్ర ప్రాంతాన్నీ, ఉభయ గోదావరి జిల్లాలనూ సస్యశ్యామలం చేసి సంపద్వంతం చేసిన ఘనతకు... తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని కాటన్ మ్యూజియం సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.**

1986లో వరదలు సంభవించినప్పుడు ఈ ప్రాంతాన్ని సందర్శించిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 'కాటన్ మ్యూజియం' ఏర్పాటు చేయాలని సంకల్పించారు. బ్రిటీష వారి హయాంలో కరువు కాటకాలనూ, జనాభా విపరీతంగా తగ్గిపోవడాన్నీ, ఆనకట్ట నిర్మాణం తరువాత గోదావరి జిల్లాల అభివృద్ధినీ కళ్లకు కట్టినట్టు చూపుతుంది.. ఇక్కడ కాటన్ విగ్రహం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది. గోదావరి నది ఆవిర్భావం నుంచీ రాజమండ్రి చేరేవరకూ, సముద్రంలో కలిసే వరకూ ఉన్న అంశాలను, ధవళేశ్వరం నుంచి వివిధ నదులు ప్రవహించే ప్రదేశం తెలియజేస్తూ... డెమోలు చూపరులకు ఎంతో సమాచారాన్ని కళ్లెదుట సాక్షాత్కరింపజేస్తాయి. భారీ ప్రాజెక్టుల్లో ఉపయోగించే రేడిగేల్ గేటు నమూనా, ధవళేశ్వరం వద్ద హెడ్ లాక్ ఛాంబర్, చిన్నతరహా నీటిపారుదలలో ఉపయోగించే గేట్లు, స్వింగ్ లిఫ్ట్ షట్టర్లు, ప్రకాశం బ్యారేజీ, 1986 వరదల్లో కొట్టుకుపోయిన బ్రిడ్జి నమూనాలు, చిత్రాలు ఇక్కడ చూడొచ్చు. మొత్తంగా వంద ఫొటోలు, చిత్రాలు, అప్పట్లో ఆనకట్టల నిర్మాణంలో వాడిన 15 పనిముట్లు ఇక్కడ ఉన్నాయి. గోదావరికి ఆనకట్ట కట్టి ఇక్కడ కరువును పారదోలాలని ఆనాటి బ్రిటీష ప్రభుత్వాన్ని ఒప్పించడంలో కాటన్ ప్రముఖ పాత్ర వహించారు. ఈ ఆనకట్ట నిర్మాణంలో కాటన్‌తోపాటు భారతీయ ఇంజనీరు రావ్ బహదూర్ వీనం వీరయ్య, కెప్టెన్ ఓర్ క్రియాశీల పాత్ర పోషించారు. వీరి చిత్రాలు ఇక్కడ చూడొచ్చు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అనారోగ్యం, తదితర కారణాలతో కాటన్ ఆస్ట్రేలియాకు వెళ్లే... చార్లెస్ అలెగ్జాండర్ ఆ బాధ్యతలు నిర్వర్తించారు. కాటన్ ప్రణాళిక ఆధారంగానే ఆనకట్టను నిర్మించారు. కాటన్, ఆయన సతీమణి ఎలిజబెత్‌ల సమాధి లండన్‌లోని డోర్కింగ్‌లో ఉంది. ఆ చిత్రం కూడా ఇక్కడ ప్రదర్శించారు. మొత్తంగా ఏడు శాఖలుగా విడిపోయి, ఇష్టానుసారం జనాన్ని ముంచే గోదావరిని నాలుగు శాఖలుగా రూపుదిద్ది, జనానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో కాటన్ విశేష ప్రతిభ చూపారు.

1833-36లో కరువు కాటకాలు తాండవించాయి. 1821లో 7,38,308 మంది ఉన్న జిల్లా జనాభా 1842 నాటికి 5,62,041కి తగ్గిపోయింది. ఆనకట్ట నిర్మాణం తరువాత 1871 నాటికి 15,92,939కి పెరిగింది. కాటన్ ఆనకట్టను నిర్మించిన క్రమం, నిర్మాణం తరువాత సిరులు పొంగే పరిస్థితిని అద్దం పట్టే ఐదు చిత్రాలు నాటి పరిస్థితులను కళ్లకు కడతాయి. ఆనకట్ట నిర్మాణ క్రమాన్ని చూపే అనేక చిత్రాలు ఈ మ్యూజియంలో పొందుపరిచారు. ఆనకట్ట ఎన్నుకున్న చోట గోదావరి వెడల్పు ఆరు కిలోమీటర్లు, అందులో మూడో వంతుకుపైగా లంకలు, నీటి మళ్లింపునకు ఇసుకతో గట్లు వేశారు. మధ్యలో శుభ్రమైన ఇసుకతిన్నె పీటగా తీసుకుని దానిపై ఆనకట్ట నిర్మించారు. 25 టన్నులు మోయగల 18 పడవలు రోజుకు 150 టన్నుల చొప్పున రాయిని తీసుకొచ్చిన క్రమం, వీటితోపాటు 11 రైలు వ్యాగన్లు క్వారీ నుంచి నదిఒడ్డుకు రాయిని మోయడం సైతం కళ్లకు గడుతుంది. అంతేకాకుండా ఒకేసారి రెండుమూడు చోట్ల పనులు నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలను సచిత్రంగా చూపారు. రైలుమార్గం ద్వారా క్వారీ నుంచి తెచ్చిన రాళ్లను పడవల్లో నింపి ఆనకట్టల మధ్య లంకల్లో గట్లను పటిష్టపరిచిన విధానమూ అప్పటి నైపుణ్యాన్ని చూపుతోంది.

1847 నాటికి 10 వేల కూలీలు, 500 మంది వడ్రంగులు, 500 మంది కమ్మరులు పనిలో చేరారు. అప్పటి రాజమండ్రి సబ్ కలెక్టర్ హెచ్.ఫోర్బ్స్ జిల్లా అధికార యంత్రాంగంతో కూలీలను పనిలో చేర్పించారు. కూలీల పిల్లలకు లేడీ కాటన్ విద్యనేర్పిన చిత్రం సైతం ఇక్కడ అందుబాట్లో ఉంది. 1847 ఆగస్టు 3వ వారానికి ఇనుము రావడంతో యంత్రసామగ్రితో పని ముమ్మరమైన తీరునూ చూపారు. ఒక్కొక్క వరుసలో 15 తూరలు గల మూడు తలుపులు, మూడు డెల్టాలకూ నీరు తీసుకుని వెళ్లేందుకు ప్రధాన ద్వారాలు, పెద్ద కాలువ ప్రారంభమైన చోట ఒక్కొక్క లాకు కట్టారు. 1852 మార్చి నాటికి రూ.15 లక్షల వ్యయంతో 11,849 అడుగులు గల ఈ ఆనకట్ట నిర్మాణ పనులు ముగిసాయి. దీంతో, ప్రభుత్వానికి కాటన్ నివేదిక పంపించారు. ఈ ఆనకట్ట పూర్తయిన తరువాత 1862-67 మధ్య ఆనకట్ట ఎత్తు రెండు అడుగులు పెంచారు. మళ్లీ 1897-99 మధ్య సిమెంట్ కాంక్రీటుతో తొమ్మిది అంగుళాల ఎత్తు పెంచారు. 1936లో మూడడుగుల తలుపులు అమర్చి, 10 లక్షల ఎకరాలకు సాగునీరందించారు. ఈ సంఘటనల క్రమమంతా సచిత్రంగా ఇక్కడ ఆకట్టుకుంటోంది. కాటన్ బ్యారేజ్ నిర్మాణ క్రమం పేరిట వాటిని రూపొందించారు.

1986 లో వరద తీవ్రతకు ఈ బ్యారేజికి, రాజమండ్రి పరీవాహక ప్రాంతానికీ తీవ్రనష్టం చేకూరింది. ఈ చిత్రాలు సైతం ఇక్కడ ఉన్నాయి. ఏలేరు ఎడమ కాలువ నమూనాలు, రాష్ట్రంలోని వివిధ జలవనరుల ప్రాజెక్టులు, కాటన్ నిర్మించిన గన్నవరం అక్విడెక్ట్, నీటిపారుదల వినియోగ వ్యవస్థలో వివిధ ఆకృతులు అన్నీ ఇక్కడ అందు బాటులో ఉన్నాయి. బ్యారేజిని సందర్శించిన ప్రముఖుల చిత్రాలు సైతం ఇక్కడ ఉన్నాయి. 1982లో కొత్త బ్యారేజి పనులకు ఇందిరా గాంధీ శంకుస్థాపన, 1986లో తుపాను నేపథ్యంలో ఎన్టీ రామా రావు సందర్శన, రాజీవ్ గాంధీ రాక, కాటన్ కుటుంబీకుల రాకను చూపే చిత్రాలు ప్రదర్శనలో ఉన్నాయి. ఆధ్యాత్మిక కోణంలో చూస్తే గోదావరి పురాణగాథను సైతం ఇక్కడ చిత్రాల రూపంలో ఉంచారు. మోడల్ ఆఫ్ గోదావరి రివర్ పేరిట గోదావరి సంక్షిప్త చరిత్ర ఇక్కడ అందుబాట్లో ఉంది. కాటన్ మునిమనుమడు రాబర్ట్, ఆయన సతీమణి నికోలెట్ కాటన్ ఈ మ్యూజియంను, కాటన్ బ్యారేజిని 2009 నవంబరు 29న ఈ సందర్శించారు. మ్యూజియం సందర్శన ఎంతో ఆనందాన్నివ్వడంతోపాటు ఆసక్తిదాయకంగా ఉందంటూ... వారి సందేశం సైతం సందర్శకులకు అందుబాట్లో ఉంది.

**-పోతుల త్రిమూర్తులు**, 9490099123

### సందర్శన వేళలు

ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1 గంటవరకూ, సాయంత్రం 3 నుంచి రాత్రి 7 వరకూ ఈ మ్యూజియం సందర్శించవచ్చు. పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5, కెమెరా, వీడియో కెమెరాలకు రూ.25 చొప్పున చెల్లించాల్సి ఉంది.

## మ్యూజియంను మరింత అభివృద్ధి చేస్తాం

కాటన్ మ్యూజియం పుష్కరాల నేపథ్యంలో అభివృద్ధి చేశాం. మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. బొమ్మూరులో కాటన్ విశ్రాంతి తీసుకున్న గృహంలో కొంత మెటీరియల్ ఉంది. దాన్ని ఇక్కడికి రప్పించి అభివృద్ధి చేసే ఆలోచన ఉంది. ఒకప్పుడు సిబ్బంది నివాసంగా ఉన్న భవనాలను మ్యూజియంగా మార్పు చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాలను కళ్లకు గట్టినట్టు చూపే మూడు డెమోలు తయారుచేయించాం. గోదావరి ఎలా వెడల్పవుతుందో, డెల్టా సిస్టమ్, 10 లక్షల ఎకరాలకు ఎలా నీరందుతుందో చూపే డెమోలు సైతం రూపొందింపజేసే ప్రణాళిక ఉంది. కేరళ నుంచి విశాఖ వరకూ డిజిటలైజ్ చేసి చూపే ప్రణాళిక ఉంది. అప్పటి మద్రాసు అధికారులతో కాటన్ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు మద్రాసు మ్యూజియంలో ఉన్నాయి. వాటిని రప్పించే ప్రయత్నం చేస్తున్నాం. 1986లో పది అడుగుల మేర నీరు నాలుగురోజులపాటు నిలువ ఉండటంతో ధవళేశ్వరంలో భద్రపరిచిన చాలా మెటీరియల్ నాశనమైంది. రూ.10 కోట్లతో ఇంజనీరింగ్ విద్యార్థులకుసైతం ఉపయోగపడేలా వేరొకచోట ఆర్కియాలజీ మ్యూజియం ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

**ఎస్.సుగుణాకరరావు, ఎస్ఇ**

## నాటి కీలక పనిముట్లు

బ్యారేజి నిర్మాణంలో కీలకంగా ఉపయోగపడిన అనేక యంత్రాలు ప్రదర్శనకు ఉంచారు. ఇవన్నీ నాటి పరిజ్ఞానంతో ఇంగ్లండ్‌లోని రాపియర్ కంపెనీతో తయారు చేయించి, ఇక్కడికి రప్పించారు.

**ఐరన్ కార్ట్ (లోహపు బండి ) :** దుంగలు, బరువు కర్ర దూలాలు లాక్కుని వెళ్లడానికి ఉపయోగించారు.

**స్టీమ్ బాయిలర్ (ఆవిరి యంత్రం) :** ఆనకట్ట పనులు, డెల్టా పనులు యంత్రాలు పనిచేయడానికి కరెంటు వాడుకలో లేని రోజుల్లో ఉపయోగించారు.

**రివిట్ హోల్ పంచింగ్ మిషను :** ఆనకట్ట తలుపులకు రివిట్ వేయడానికి వాడారు

**గ్రైండర్ :** 1863లో పనిముట్లను సానపట్టడానికి వినియోగించిన యంత్రం

**ఇంగర్ సోల్ రాండ్ కలిక్స్ కోర్‌డ్రిల్ :** ఆనకట్ట గర్భంలో ఇసుక కూరి నింపడానికి నాలుగు అంగుళాల రంధ్రం చేయడానికి వాడారు

**ఎయిర్ కంప్రెసర్ :** ఆనకట్ట లోపల ఏర్పడిన రంధ్రాలకు ఇసుక చల్లించి, నింపుటకు ఉపయోగించిన యంత్రం. కృష్ణా ఆనకట్ట తలుపుల రివిటింగ్‌కు వాడిన స్టీమ్ బాయిలర్‌సైతం ఇక్కడ ఉంది.

వీటితోపాటు ఇక్కడ చిన్నపాటి పార్కుసైతం జలతరళ పేరిట 1988 ఏప్రిల్ 20న ఏర్పాటుచేశారు.

**1863 సంవత్సరం లో ఆనకట్ట పనిముట్లకు సాన పట్టిన యంత్రం**



ఇసుక కూరి నింపటానికి నాలుగు అంగుళముల రంధ్రం వేయడానికి వాడినది.

పరిచయం అవసరం లేని ఖంగుమనిపించే కంచుకంఠం ఆయనది! ఎన్టీరామారావు, అక్కినేని, కృష్ణ, శోభన్‌బాబు, హరనాథ్, కాంతారావు వంటి దిగ్గజాల్లాంటి నటులున్నప్పటికీ తనదైన ప్రత్యేక ముద్రతో చివరి వరకూ వెనకున్నట్లు కనిపించి అందరికంటే ముందున్న నటుడు కొంగర జగ్గయ్య!

# విలక్షణ నటుడు

గుంటూరు జిల్లా తెనాలి నగరం కళలకు ప్రసిద్ధి. అలాగే సంపన్నులకూ పేర్గాంచినదే! అటువంటి సంపన్న కుటుంబంలో పుట్టిన నటుడు కొంగర జగ్గయ్య. చిన్నతనం నుండి తనదైన వ్యక్తిత్వాన్ని సంతరించుకొని చదువులోనూ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుండేవాడు. తెలుగు, ఇంగ్లీషు భాషల పట్ల మక్కువ పెంచుకున్న జగ్గయ్య తెలుగు కవులు, ఆంగ్ల కవులను అవపోసన పట్టాడు. షేక్స్పియర్ నాటకాలను వంటబట్టించుకున్నాడు. పలు రంగస్థల ప్రదర్శనల్లో అప్పటి సహాధ్యాయి ఎన్టీఆర్‌తో కలిసి ప్రదర్శనలిచ్చాడు. ఆ ప్రదర్శనల్లో బహుమతుల్ని జగ్గయ్య కైవసం చేసుకున్నాడని చెప్పడం అతిశయోక్తి కాదు. చిన్నతనంలోనే దేశాభిమాని పత్రిక కోసం విరివిగా తన రచనలు అందించిన జగ్గయ్య అడవి బాపిరాజు లాంటి మహోన్నతమైన వ్యక్తి దగ్గర చిత్ర లేఖనం కూడా నేర్చుకున్నాడు. గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కాలేజీ తనను ఔత్సాహిక కళాకారుడిగా తీర్చిదిద్దిందని ఒప్పుకునేవారు. ఈ సమయంలో ఆంధ్ర రిపబ్లిక్ అనే వార పత్రికకు కొంత కాలం సంపాదకుడిగా పనిచేసిన అనుభవంతో ఆకాశ వాణిలో వార్తలు చదవడం ఆరంభించాడు. 'ఆకాశవాణి! వార్తలు చదువుతోంది కొంగర జగ్గయ్య' అంటూ తన కంచు కంఠంతో సుస్పష్టంగా వార్తలను చదువుతూ ఎందరికో మార్గదర్శకంగా నిలిచాడు. 'ప్రియురాలు' (త్రిపురనేని గోపిచంద్ రచన) చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసినా అర్ధాంగి, బంగారు పాప చిత్రాలతో చక్కని నటుడిగా రాణించాడు. అయిదవ దశకం నుంచి ఇంచుమించు ఎనిమిదివ దశకం వరకూ తిరుగులేని నటుడిగా రాణించాడు. ఇది ఒక్క జగ్గయ్యకే సాధ్యపడింది. చిన్నతనం నుంచి క్రమశిక్షణ, పట్టుదల, అత్మావలోకనం చేసుకొనే గుణం... అన్నింటిని మించి పెద్ద కళ్ళు (నవరసాలు పలికించే విధంగా), స్పష్టమైన గంభీరమైన గొంతు ఇవన్నీ జగ్గయ్య ప్రతిభకి అదనపు ఆకర్షణలయ్యాయి. ఇతర భాషల్లో అగ్రహీరోలు సైతం జగ్గయ్య చేతనే డబ్బింగ్ చెప్పించుకునేందుకు ఉబలాటపడేవాళ్ళు. శివాజీ గణేశన్, గౌతమ్ ఘోష్, తెలుగు జురాసిక్ పార్కుకు డబ్బింగ్ చెప్పి కళారంగంలో కళావాచస్పతిగా నిలిచిపోయాడు.

**రాజకీయ నేపథ్యం**

చిన్నతనం నుంచి దేశభక్తి, సామాజిక స్పృహతో పెరిగిన జగ్గయ్య స్వీయ నిర్మాణంలో పదండి ముందుకు చిత్రాన్ని నిర్మించి నటించాడు (1961). రష్యా, మాస్కో, ఇంటర్ నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన చిత్రంగా చెప్పుకోవచ్చు. ఇది రాజకీయ నేపథ్యం వున్న చిత్రంగా ప్రస్థావించడం జరిగింది. రాజకీయంగా జయప్రకాష్ నారాయణ భావాలకు కొంతకాలం ప్రభావితుడై ప్రజా సోషలిస్ట్ పార్టీలో చేరినా నెహ్రూ పిలుపునందుకొని 1956లో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది. 1967లో ఒంగోలు నుండి నాలుగవ లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ టికెట్ మీద పోటీ చేసి ఎనభై

**'అప్పు చేసి పప్పు కూడు ' లో సావిత్రి, రామారావుతో ...**

వేల మెజారిటీతో గెలుపొందాడు. ఆ రోజుల్లో అది సంచలనం!

**అరుదైన చిత్రాలు**

దొంగరాముడు, ముద్దుబిడ్డ, తోడి కోడళ్ళు ఆలుమగలు, అప్పు చేసి పప్పు కూడు, పెళ్ళి కానుక, వెలుగు నీడలు, పెళ్ళి కాని పిల్లలు, ఆరాధన, పూజా ఫలం, మంచి మనిషి, ఈడు జోడు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మబలం, ఉయ్యాల జంపాల, సుమంగళి, ప్రేమించి చూడు, మనసే మందిరం, అల్లూరి సీతారామరాజు, అడవి రాముడు, చాణక్య చంద్రగుప్త, కరుణామయుడు, న్యాయం కావాలి, సీతాకోక చిలుక, బొబ్బిలి పులి, మేఘ సందేశం, స్వాతి, అడవి దొంగ, విశ్వనాథ నాయకుడు, ఇలా ఎన్నో సినిమాల్లో తన ప్రత్యేకతను ప్రదర్శించారు. జమున చిన్నతనంలో తన వద్దే చదువుకుంది. బహుశా అందుకేనేమో ఎక్కువ సినిమాల్లో నటించింది. అలాగే మహానటి సావిత్రి వరుసకు మేనకోడలవుతుంది. సావిత్రి సరసన మహోన్నతమైన చిత్రాల్లో నటించాడు. ఎక్కువ సినిమాల్లో చేయలేకపోవడానికి కారణం. షూటింగ్ షెడ్యూల్, కాల్షీట్లు, కాస్ట్యూమ్స్.. ఆరుగంటలు దాటాక విధిగా విరామం డబ్బు విషయంలో నిర్మోహమాటంగా వ్యవహరించడం. ప్రొడక్షన్లో ఏది నచ్చకపోయినా వున్నది ఉన్నట్టు మొహం మీదే చెప్పేవాడు. ఇవన్నీ దర్శక నిర్మాతలకు జీర్ణమయ్యేవి కావు. అక్కినేనితో తన కాంబినేషన్ విజయవంతం అవ్వడం వలన ఎక్కువ చిత్రాల్లో కొనసాగారు.

**అవార్డులు... రివార్డులు...**

'బంగారుపాప' చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ గుర్తింపు వచ్చింది. అర్ధాంగి, మరో జాతీయ అవార్డు (తెలుగు చిత్రం) ఏది నిజం, తోడికోడళ్ళు చిత్రాలు వరుసగా జాతీయ ఉత్తమ తెలుగు చిత్రాలుగా బహుమతులు సొంతం చేసుకున్నాడు. డా॥ చక్రవర్తి, అంతస్తులు, సీతాకోకచిలుక చిత్రాలు కూడా జాతీయ ఉత్తమ తెలుగు చిత్రాలుగా బహుమతులు దక్కించుకున్నాయి. 1962 పదండి ముందుకు చిత్ర నిర్మాతగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నగదు బహుమతిని అందించింది. తమిళనాడు ప్రభుత్వం 'కళైమామణి' అవార్డుతో సత్కరించింది.

1992 భారత ప్రభుత్వం పద్మభూషణ్ సత్కారంతో గౌరవించింది. ఇదిగాక ఢిల్లీ సంస్కృత విద్యాలయం వారు కళావాచస్పతి బిరుదుతోనూ, ఆంధ్ర యూనివర్సిటీ వారు కళా ప్రపూర్ణ డాక్టరేట్‌తోనూ, హైద్రాబాద్ తెలుగు యూనివర్సిటీ డా.లిట్ ప్రదానం చేస్తూ గౌరవించాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలిని రవీంద్రగీతగా తెలుగీకరించారు. ఠాగూర్ నాటకం శాక్రిఫైస్‌ని బలిదానంగా అక్షరీకరించారు. జగ్గయ్య లోని ప్రతిభకి నిలువెత్తు నిదర్శనం ఇవి.

**నటించకపోతే చచ్చిపోతామా?**

ఆ రోజుల్లో కొనవూపిరి ఉన్నంత వరకు నటిస్తాం అని చెప్పడం పెద్ద ఫ్యాషనైపోయింది. అది విన్న జగ్గయ్య మండిపడ్డారు. ఎప్పుడు పాత నటులే నటించాలా? కొత్త వారు రానవసరం లేదా? ఏం నటించకపోతే చచ్చిపోతామా? అంటూ విరుచుకు పడ్డారు. ఈ స్టేట్ మెంట్ అగ్రనటులు విని కూడా మౌనం వహించారు. ఎన్టీఆర్ ఒక్కడుగు ముందుకేసి "బ్రదర్ బాగా చెప్పారు. ఇండస్ట్రీ ఎవరి సొంతం కాదు. పాత తరం నటులు అలా అనుకుంటే మేం వచ్చేవాళ్ళమా?" అంటూ సమర్థించారు. అలాగే జగ్గయ్య చివరి రోజుల్లో చాలా చిత్రాలని తిరస్కరించారు. కావాల్సినంత డబ్బు నాకుంది. రోజుకి అయిదువేల రూపాయలు అద్దె వచ్చే ఇల్లుంది..ఇంకేం కావాలి? వుంటే మట్టుకు నాతో పట్టుకుపోతానా? అంటూ ఆత్మీయులతో పంచుకొనేవారు. సాహిత్యమంటే ఆరో ప్రాణం. గంటల తరబడి సాహిత్య గోష్ఠిలో కాలాన్ని మరిచిపోయి కేరింతలు కొట్టేవారు. ఆత్రేయ గారు కలిస్తే ఇక అంతే... కామాలూ, ఫుల్‌స్టాపులూ లేకుండా నాన్ స్టాప్‌గా కొనసాగేది చర్చ! అదే జగ్గయ్య ప్రత్యేకత.

**కొత్త సంవత్సరం ... సరికొత్త రుచులు...**

డిసెంబరు 31 జగ్గయ్య జన్మదినోత్సవం సందర్భంగా గ్రాండ్ పార్టీ ఇచ్చేవారు. ఇండస్ట్రీ మొత్తం అన్నా నగర్‌లో హాజరు వేయించుకొనేది. ముఖ్యంగా పార్టీ ప్రియులకు అక్కడ పండుగే. జగ్గయ్య గంభీరంగా ఉంటారు. మనసు వెన్న. ఒక్కోసారి వెన్నలా కరిగిపోతారు, కానీ వజ్ర సంకల్పం. నటీనటుల్లో సావిత్రి, యస్వీఆర్‌లను విపరీతంగా అభిమానించే జగ్గయ్య రచయితల్లో ఆత్రేయ ఆంతరంగికుడు. ఆత్రేయ పాటలు జగ్గయ్యకు కంఠతా వచ్చు. జగ్గయ్య మాటలను ఆత్రేయ అలవోకగా చెప్పేయగలడు. అదీ వారి స్నేహ బంధం. చివరికి మరణంలోనూ తోడు ఉన్నారు. జగ్గయ్య కాలు జారిపడి అనతికాలంలోనే చనిపోయాడు. జగ్గయ్య మాటా, ఆత్రేయ పాట నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.

**ఇమంది రామారావు**
9010133844

వాణిశ్రీ తో ...

జయసుధతో ...

ఆల్ ఇండియా రేడియోలో పనిచేసినప్పుడు తోటి ఉద్యోగులతో...



# మాస్టారే...పాప్ స్టార్‌లా మారాడు



**వి**ల్ బ్రూకర్ అనే బ్రిటిష్ మాస్టారికి ఓ ఆలోచన వచ్చింది. తాను చెప్పే సినిమా సబ్జెక్ట్‌ను ప్రియ శిష్యుల మెదళ్లకు పట్టించగలుగుతున్నాడా అనే సదరు ప్రశ్న తలెత్తింది. సందేహ నివృత్తికి రంగంలోకి దిగాడు. ఏకంగా ఓ పాప్‌స్టార్ అవతారమెత్తి జనం మధ్యలో చొరబడ్డాడు. అప్పుడే గానీ తాను పాప్‌స్టార్‌ల విజయ రహస్యాలపై ఇచ్చే స్పీచ్‌లకు బలముండదని నమ్మాడు. దీనికోసం లండన్‌లో 70లలో ఊపేసిన పాప్ ఐకాన్ డేవిడ్ బౌయీని ఆవాహన చేసుకున్నాడు. అదేలెండి అలా మేకప్పు, బాడీ ల్యాంగ్వేజీ ఎక్స్‌ట్రా ఎక్ట్రా అన్నింటినీ ఔపోసన పట్టి వీధుల్లోకి వచ్చాడు. ఇదంతా పిచ్చిలా ఉందని అంటే తాను చేసే పనిని స్ప్లిట్ పర్సనాలిటీ అంటాడు, వింటేజీ వేషాలంటాడు. అలా ఓ పెద్ద కథాకమీమిషు అందుకున్నాడు. అయితే ఆయన వెర్రిలో ఓ బలమైన ప్రాక్టికాలిటీ ఉన్నా చిన్న లాజిక్ మిస్సయ్యాడనిపిస్తోంది. మిలినీయం ముందున్న యువత వెర్రి పరివిధాలా మార్పులు చెందాక 70ల పాప్‌స్టార్ వేషాలు చూసి పిచ్చెక్కి చచ్చేవారు ఎవరు ఉంటారని. కానీ మరో రకంగా మాత్రం హిట్ అయ్యాడు, పిచ్చి మేకప్పులతో సెటైర్లకు స్కోపిచ్చి.

వింత లోకం

## రైల్లోనే నివాసం

**జ**ర్మనీలో 23 ఏళ్ల కుర్రది మరో చాలెంజ్ చేస్తోంది. ఇది స్టీరియోఫోనిక్‌లను కుదేలు చేస్తోంది. ప్రతి సారి ఇంటి యజమానితో ఏదో పేచీతో విసిగిపోయిన లియోనీ ముల్లర్ అనే యువతి తన అద్దె ఇంటి కష్టాలకు మరో రకంగా చెక్‌పెట్టింది. ఎందుకు అందరూ ఓ ఇంట్లో ఓ చోటే పరిమితమై బతికేయాలని తెగ ఆరాటపడతారు. టయానికి రోజూ అదే చోటకు తిరిగి చెక్కేయాలని చికాకు పడతారు అని ప్రశ్నిస్తోంది. తాను మాత్రం ఆధునిక సంచారిలా బతికేందుకే ఓటు వేస్తానని చెప్పి ఓ స్పెషల్ టికెట్ కొనేసింది. ఆ టికెట్ కొన్నవారు జీవితాంతం రైళ్లలో హాయిగా విహరించొచ్చు. ఒకేసారి జీవితకాల ప్రయాణానికి టికెట్ కొనుక్కునేవారికి భారీ రాయితీ కూడా వస్తుంది. ఈ టికెట్‌నే కొనేసి ఎంచక్కా తన ఇంటిని రైళ్లలోకి సర్దేసింది. ఇల్లంతా కాదులెండి ఇళ్లూ వాకిలీ అనే వ్యవస్థను. ఓ బ్యాక్‌ప్యాక్ సరిపడా వస్తువులతో చక్కగా రైలు ప్రయాణాల్లో సాగిపోతూ చదువునూ కొనసాగిస్తోంది. ఈమెను చూసి వారి ఫ్రెండ్స్ చాలా గర్వపడుతున్నారట. తాము కలలో కూడా ఊహించలేని సాహసోపేతమైన, అద్భుతమైన జీవితాన్ని ముల్లర్ ఆస్వాదిస్తోందని చెబుతున్నారు.

## 'మోడల్' తాత

**మో**డలింగ్ ఐకాన్ అవ్వాలంటే ఆరుపలకల దేహముండాలి, టీనేజీ ఛాయలుండాలి అనే రియాలిటీ షోల వ్యాఖ్యాతల సుదీర్ఘ వ్యాఖ్యానాలతో డస్సిపోతున్న ఫ్యాషన్ ప్రేమికులకు ఓ తాత సరికొత్త ట్రెండ్ తెచ్చాడు. జీన్స్‌ను మడతపెట్టి షర్ట్‌ను మెలియతిప్పి మాస్ మేనరిజంలోను క్లాస్ లుక్స్‌తో బెర్లిన్‌లో మోతపెట్టిస్తున్నాడు. తెగ స్టైలు కొట్టే కుర్రకారు కూడా ఈ తాతతో పోటీ అంటే ఏదో ఫోన్ వచ్చినట్టు పక్కకు తప్పుకుపోతున్నారట. గంథర్ క్రాబ్బెన్‌హాఫ్ట్ అనే ఈ తాతగారితో అక్కడ ప్రత్యేక పేరు సంపాదించిన మోడలింగ్ సంస్థ 'వుయ్ ఆర్ అన్‌లైక్ యూ' మోడలింగ్ సంస్థ కాంట్రాక్ట్ కూడా కుదుర్చుకుంది. గంథర్ ఇచ్చిన రకరకాల ఫోజులతో యాడ్ బోర్డులన్ని నిండిపోతున్నాయి. స్టైల్ అనేది వయసుతో లెక్కించేది కాదు అది మన మేనరిజంలో ఉంటుందని జేబులో స్టైయిల్‌గా చేతులు పెట్టి చెబుతున్నాడు. కొందరు వందేళ్లుంటాయని అంటే మరికొందరు 70ల పడిలో పడొచ్చు అని అంటున్నారు. తాను మాత్రం 17 ఏళ్ల కుర్రాడిలా యాట్టిట్యూడ్ చూపిస్తున్నాడు.



# మంచినీటి పుస్తకం

**ఓ పుస్తకం తయారవుతోంది. చదవడానికి కాదు. తాగడానికి. స్వచ్ఛమైన మంచినీటిలా ఫిల్టర్ చేసే కాగితాలతో అది రూపొందుతోంది. పుస్తకాల్ని చించి కాగితపు పడవలు చేయడం చిన్నారులకు మహా సరదా. అలాగే సరదాగా ఆ పుస్తకంలోని కాగితాల్ని చించి నీటిని వడకట్టేయొచ్చు. ఈ మంచి నీటి పుస్తకాలు భవిష్యత్తులో పేద దేశాల తాగునీటి సమస్యకు ఓ పరిష్కారం చూపుతాయని శాస్త్రవేత్తల మాట.**

**నీ**టి ద్వారానే ఎక్కువ శాతం అంటు వ్యాధులు ప్రబలుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా 34 లక్షల మంది మరణాలకు కారణం కలుషితమైన నీరే, అపరిశుభ్రతే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నివేదిక. కంటికి కనిపించని బ్యాక్టీరియా, వైరస్, ప్రొటోజోవాలు వంటి సూక్ష్మజీవులున్న నీటిని గుర్తించడం చాలా కష్టం. అవి స్వచ్ఛంగా ఉన్నాయనుకుని తాగునీటిలా వాడుతుంటారు. ముఖ్యంగా పేద దేశాల్లో మురికినీటిని వాడటం సర్వసాధారణం. భారత్‌లాంటి దేశాల్లో మినరల్ వాటర్ వ్యాపారం లాభసాటిగా మారిపోతే, సామాన్యులు వాటిని కొనలేని స్థితిలోకి వెళ్లిపోతున్నారు. ఒకప్పుడు చెరువు నీరు స్వచ్ఛంగా ఉంటే, ఇప్పుడు పారే నీరు కూడా కాలుష్య కాసారామవుతోంది. ఇదే సమస్యపై దృష్టి సారించింది పోస్ట్ డాక్టోరల్ పరిశోధకురాలు థెరెసా డాంకోవిచ్.

**ఫిల్టర్ చేసే కాగితాలు**

కేవలం ఖరీదైన మెషీన్లు, వాటర్ ప్లాంట్లు ద్వారానే నీటిని శుద్ధి చేయగలిగితే ధనిక దేశాలే ఆరోగ్యంగా ఉంటాయి. అదే చాలా తేలిగ్గా సామాన్యుడు కూడా తేలిగ్గా వినియోగించేలా ఏదైనా సాంకేతికత కనుగొనాలనేది థెరెసా తపన. అలా ఆమె అనేక ప్రయోగాలు చేస్తుండగా ఓ సారి ఫిల్టర్ షీట్ల అంశం దృష్టిలోకి వచ్చింది. రాగి, వెండి కణాలతో షీట్లను తయారుచేసి వాటి గుండా నీటిని వదిలితే సూక్ష్మజీవులు నిర్మూలించ వచ్చనేదే విషయం. దీన్ని సామాన్యుడికి అనువుగా మార్చే ఉపాయాన్నే ఆలోచించింది ఆమె. అలా ఆలోచిస్తుండగానే పిల్లలు చింపి పడేసే కాగితాలు గుర్తొచ్చాయి. అలా తేలిగ్గా చింపి వాడుకునేలా ఆ షీట్లను ఎందుకు డిజైన్ చేయకూడదని ప్రశ్నించుకుంది. అంతే వాటర్ ఫిల్టర్ కాగితాలున్న బుక్ రూపకల్పనపై ప్రయోగాలు చేపట్టింది. కొన్నేళ్లుగా కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయం, వర్జీనియా విశ్వవిద్యాలయంలోను పరిశోధన చేసిన ఆమె చివరకు వాటర్ ఫిల్టర్ పుస్తక తయారీలో విజయం సాధించింది. 90 శాతం నీటిలోని బ్యాక్టీరియాను హరించేయగలవు ఆ కాగితాలు. రాగి, వెండి అయాన్లను సూక్ష్మజీవులు గ్రహించడంతో అవి నాశనమవుతాయి. ఇదే ఇందులోని సూత్రం. ఈ కాగితాల్ని ఫిల్టర్ హోల్డర్లలో పెట్టి బావులు, కొలనులు, చెరువులు, వాగులు, నదుల నీటిని తేలిగ్గా ఫిల్టర్ చేయొచ్చు. 2014 వేసవిలో ఈ కాగితాలను పెద్ద ఎత్తున ఉపయోగి ంచి పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాల సమయం లో వీటి వాడకం ఎన్నో ప్రాణాల్ని నిలబెట్టే అవకాశ ముందని అంటున్నారు. ప్రస్తుతానికి బ్యాక్టీరియాపై విజయం సాధించినా కొన్ని రకాల వైరస్‌లు, ప్రొటోజోవాలనూ నిర్మూలించగలిగేలా కాగితంలో అనేక మార్పులు చేర్పులు చేస్తోంది ఆమె బృందం. నానోకణాలను వినియోగించే ఈ కాగితం ద్వారా 100 లీటర్ల నీటిని శుద్ధి చేసుకోవచ్చు. భారత్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఘనా వంటి దేశాల్లో 25 చోట్ల నుంచి నీటి శాంపిళ్లను సేకరించి ఈ ఫిల్టర్ కాగితాల్ని పరిశీలించి చూశారు. ప్రతి చోట 99 శాతం ఫలితాలు వచ్చాయి. మురుగు నీటిని నేరుగా వాగులోకి వదిలే ప్రాంతంలోను ఆమె కాగితాలు నీటిని పరిశుద్ధం చేశాయి. ఒక పుస్తకం ఒక మనిషి తాగునీటి అవసరాలకు నాలుగేళ్లు ఉపయోగపడుతుంది. ప్రస్తుతానికి చేతులతోనే తయారు చేస్తున్న ఆ పుస్తకాల్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే స్థాయికి తీసుకెళ్లే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కో పేపర్ ట్రీట్‌మెంట్‌కు 60 గంటల సమయం పడుతుండటంతో మరింత త్వరగా పుస్తకాల తయారీకి డిజైన్లను, సాంకేతికతను మారుస్తున్నారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధుల్ని సేకరిస్తున్న థెరెసాకు ఇప్పుడిప్పుడే మద్దతు అందుతోంది. అంతకు ముందు ఓ చర్చి వంటగదిలో కాగితాల దొంతంలను తయారుచేస్తున్న పరిస్థితి నుంచి ఆమెకు యంత్రాన్ని ఉపయోగించుకునే ఆర్థిక దన్ను లభిస్తోంది.

**వాళ్లు సైతం...**

కొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆమె ప్రయోగాల్లో భాగస్వాములవుతున్నారు. దక్షిణాఫ్రికాలోని కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయ ఎమ్మెస్ విద్యార్థిని కోరీన్ తన బృందంతో అక్కడ అనేక శాంపిళ్లను సేకరించి ఈ కాగితాన్ని వినియోగించి సత్ఫలితాల్ని సాధించింది. 20 వేల డాలర్లకు 1000 పుస్తకాల్ని రూపొందించే స్థాయికి చేరేలా ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 'వాటర్ ఈజ్ లైఫ్' అనే స్వచ్ఛంద సంస్థ కూడా థెరెసా కృషికి తోడయ్యింది. ప్రపంచంలో విరివిగా ఉపయోగిస్తున్న 5 గేలన్ల నీటి పాత్రలకు అమరేలా కాగిత డిజైన్లను రూపొందిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి జరుగుతోంది. ఈ నీటి పుస్తకాల ఆలోచన చాలా బాగుందని వివిధ దేశాల శాస్త్రవేత్తలు ఆమెను ప్రశంసిస్తున్నారు. సామాన్యుడికి శాస్త్రీయ జ్ఞానాన్ని దగ్గర చేసేలా కూల్ కెమిస్ట్రీ అనే మాటను ఆమె ఎక్కువగా ఉనికిలోకి తేవాలని కోరుతోంది. ✦



◆ కథ



# ఆర్థిక బంధాలే మానవ సంబంధాలైన వేళ !?

- విదదల సాంబశివరావు
9866400059

అర్ధరాత్రి పన్నెండు గంటల ముప్పై నిమిషాలు దాటింది. గాఢ నిద్రలో వున్న శ్రీదేవి తన పర్సనల్ మొబైల్ రింగ్ కావడంతో ఒకింత అసహనంగా ఫోన్ అందుకుంది.

"హలో, ..." శ్రీదేవి గొంతులో చిరాకు ధ్వనించింది.

"నాన్నను మాట్లాడుతున్నానమ్మా ..." అవతలివైపు నుంచి తాపీగా, హుందాగా విన్పించిందో స్వరం.

శ్రీదేవిని నిద్రమత్తు విడిచిపోయింది.

"ఏమిటి నాన్నా ఈ టైములో కాల్ చేశారు? ఏదైనా ముఖ్యమైన విషయం గురించి మాట్లాడాలా?"

"అవునమ్మా! ఈ జన్మ చాలించే ముందు చివరి సారిగా నీ గొంతు వినాలనిపించిందమ్మా!" స్థిరమైన అభిప్రాయం ఆయన స్వరంలో ధ్వనించింది.

ఉలిక్కిపడింది శ్రీదేవి. కంగారు పడిపోతూ భయంతో అన్నది.

"ఏమిటి నాన్నా మీరు మాట్లాడేది? నాకేమీ అర్థం కాలేదు?"

"ఓ అయిదు నిమిషాల వ్యవధిలో నేను మరణించబోతున్నాను. గుంటూరు-విజయవాడ రైల్వేట్రాక్‌పై వెనిగళ్ళ గ్రామం దగ్గర రైలు పట్టాలపై నా శవం వుంటుంది."

"నాన్నగారూ .... ప్లీజ్, మీ నిర్ణయం మార్చుకోవలసినదిగా చేతులెత్తి ప్రార్థిస్తున్నాను. అసలేం జరిగిందో నాకు చెప్పండి. ఇంత కఠినమైన నిర్ణయం తీసుకోవడానికి కారణం ఏమిటి? కారకులు ఎవరు? వివరంగా చెప్పండి నాన్నగారు! సమస్య ఏదైనా సామరస్యంగా పరిష్కారం చేసుకుందాం". ఆమె గొంతులో ఆత్రుత, భయం స్పష్టంగా కన్పించాయి.

ఆ నడిరేయి నిశ్శబ్దంలో శ్రీదేవి గొంతు విని నిద్రపోతున్న ఆమె భర్త మేలుకొని మంచంపై కూర్చున్నాడు. ఆమె మాటలను శ్రద్ధగా వింటున్నాడు.

"లేదమ్మా! మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయిన నేటి వ్యవస్థలో మనిషిగా నేను బతకలేను".

ఆయన మాటలు సూటిగా ఆమె మెదడును తాకాయి.

"ఏమిటినాన్నా... మీరంటోంది?" ఆమె గొంతులో ఆందోళన...

"కుటుంబ బంధాలలో ప్రేమానురాగాలు లోపించాయి. ఆర్థిక బంధాలతో కుటుంబ వ్యవస్థ పతనావస్థకు చేరుకుంది. ఈ దుస్థితిలో మనిషిగా మనుగడ సాగించలేను." తాపీగా చెప్పుకుపోతున్న అతని మాటలను అడ్డుకున్నది శ్రీదేవి.

"నాన్నా... ప్లీజ్ ... మీరేం మాట్లాడకండి. నేనూ, మీ అల్లుడుగారు ఇప్పుడే గుంటూరు బైలుదేరుతున్నాం....ఒక్క క్షణం లైన్‌లో వుండండి ... మీ అల్లుడుగారితో మాట్లాడండి."

ధన్‌ధన్‌మంటూ శబ్దాలు వినిపించసాగాయి ఫోన్‌లో .... ఆమె కంగారు పడుతూ భర్తకు ఫోన్ అందించింది. ఫోన్‌లో లౌడ్ స్పీకర్ ఆన్‌చేసింది. ఆమె ముఖం కన్నీటితో తడిసిపోయింది.

"హలో... మామయ్యగారూ....".

"బాబూ రవిచంద్రా ... నా బంగారు తల్లిని జాగ్రత్తగా చూసుకో! శ్రీదేవిని నా గుండెల్లో పెట్టుకొని పెంచాను. తల్లీ తండ్రీ సర్వమూ నీవే!" ఆయన స్వరంలో కూతురి పట్ల ప్రేమ స్పష్టంగా ధ్వనించింది.

"అసలేం జరిగింది మామయ్యగారూ? నాకు వివరంగా చెప్పండి. నేను ఈ రాష్ట్రానికి హోంశాఖ మంత్రిని. మీ సమస్య ఏదైనా నేను పరిష్కారం చేస్తాను!".

రవిచంద్ర కంఠంలో ధీమా, అధికార దర్పం ధ్వనించాయి.

"అధికారంతో, డబ్బుతో దేనినైనా సాధించవచ్చు. మానసిక వేదనను మాత్రం అవి తీర్చలేవు! అన్ని విషయాలు నేను మరణించిన తర్వాత మీరు తెలుసుకుంటారు".

"మామయ్యగారూ ..." అతను మాట్లాడబోతున్నాడు. కానీ, ఆయన వినిపించుకోదల్చుకోలేదు. క్షణ క్షణానికి రైలు పట్టాలపై శబ్దం తీవ్రమవుతోంది, ఆయన చివరిసారిగా మాట్లాడిన పలుకులు ఆ భార్యా భర్తల గుండెల్ని పిండి చేశాయి.

"అదిగో మృత్యువు నాకు దగ్గరగా వచ్చేస్తోంది. వద్దనుకుంటే నేను తప్పుకోగలను. కానీ, మృత్యువు కౌగిలిలో ఒదిగిపోవడానికి నేనే ముందుకు దూసుకుపోతున్నాను."

రైలు వస్తోన్న శబ్దం భయంకరంగా వినిపిస్తోంది.

"నాన్నా ... ప్లీజ్ ... నా కోసం మీ నిర్ణయం మార్చుకోండి".

"మామయ్యగారూ  దయచేసి వెనక్కి రండి"!

శ్రీదేవి, రవిచంద్ర దు:ఖంతో అభ్యర్థిస్తున్నారు.

అవతలివైపు నుంచి ఎలాంటి స్పందనా లేదు. క్రమంగా రైలు శబ్దాలు ఆగిపోయాయి.

ఆ అర్ధరాత్రివేళ శ్రీదేవి, రవిచంద్ర గుంటూరు బైలుదేరారు.

✧ ✧ ✧

ప్రముఖ పారిశ్రామికవేత్త వాసిరెడ్డి భాస్కరమూర్తి నివాసం.

గుంటూరు నగరంలో సంపన్నులు నివసించే విద్యానగర్‌లోని ఆయన ఇంటి ముందు వేలాది ప్రజానీకం గుమికూడి వున్నారు. పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.

విద్యాధికుడు, లౌకికుడు, అజాతశత్రువు అయిన భాస్కరమూర్తి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?

"ఆర్థికపరమైన ఇబ్బందులు లేవు.... అనారోగ్య సమస్యలు లేవు! ....కుటుంబ సమస్యలు లేవు .... మానసిక సమస్యలు లేవు!" అక్కడకు చేరిన ప్రతి ఒక్కరూ ప్రతి సమస్యను గురించి చర్చ లేవదీసి .... చివరకు ఆయనకు ఏ సమస్యలూ లేవని నిర్ధరించుకున్నారు.

"కానీ .... ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు?"

అక్కడకు చేరిన అందరిలో ఈ ప్రశ్నకు సమాధానం మాత్రం లభించలేదు.

భాస్కరమూర్తి మృత దేహాన్ని కడసారి దర్శించి నివాళులర్పించేందుకు నగరంలోని ప్రముఖులే గాక రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రజానీకం కూడా తరలివచ్చారు.

ఆయన అల్లుడు రవిచంద్ర రాష్ట్ర హోంశాఖా మాత్యునిగా అత్యంత గౌరవప్రదమైన పదవిలో వుండటం వలన రాష్ట్ర ముఖ్యమంత్రి .... ఆయన మంత్రివర్గ సహచరులు, అధికార అనధికార ప్రముఖులు కూడా నివాళులర్పించేందుకు వచ్చారు. భారతదేశం నుండి విదేశాలకు పొగాకు ఎగుమతి చేసే ప్రముఖ పారిశ్రామికవేత్తలలో భాస్కరమూర్తి ఒకరు. ఆయనకు కేవలం పొగాకు కంపెనీలే కాదు – పత్తి వ్యాపారానికి సంబంధించిన జిన్నింగ్, స్పిన్నింగ్, టెక్స్‌టైల్ మిల్లులు కూడా వున్నాయి. ఆ పరిశ్రమలలో పనిచేసే వేలాది కార్మికులు గుండెలు పగిలేలా రోదిస్తూ .... తమందరిని కన్నబిడ్డల్లా ప్రేమించిన ఆ అమృతమూర్తికి చివరిసారిగా కన్నీటి నివాళి అర్పించారు. విద్యానగర్ యావత్తూ జన సంద్రమై పోయింది.

"ఎంత సేపటికి అంతిమ యాత్ర ప్రారంభమౌతుంది?" ఎవరో అడిగారు.

"హైదరాబాదు నుండి ఆయన ప్రాణ స్నేహితుడు రావాలట. ఆయన వచ్చిన వెంటనే కార్యక్రమం మొదలవుతుంది". వేరొకరు సమాధానం చెప్పారు.

అక్కడకు చేరిన అందరూ ఈవిధంగా చర్చించుకుంటున్న సమయంలో ఓ ఇన్నోవా కారు వేగంగా వచ్చి ఆ ఇంటి ముందు ఆగింది. అందరి కళ్ళు ఆ కారు వైపు చూశాయి.

జేవురించిన ముఖంతో .... ఉబికి ఉబికి వస్తోన్న కన్నీటిని ఆపుకోలేక .... ఆ అశ్రువులు ధారాపాతంగా వర్షిస్తోంటే కారులో నుంచి కిందకు దిగాడు ఆరడుగుల ఆజానుబాహువు. ఆయనను చూసిన భాస్కరమూర్తి కుటుంబ సభ్యులు గౌరవంగా లేచి నిల్చున్నారు.

నెమ్మదిగా నడిచివచ్చి శోకతప్త హృదయంతో ప్రియమిత్రుని నిర్జీవ శవాన్ని చూసి భోరున విలపించాడు .... హైకోర్టు న్యాయమూర్తి ....భాస్కరమూర్తి బాల్య స్నేహితుడు .... ఆప్తమిత్రుడు ప్రభాకరమూర్తి. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే భాస్కరమూర్తి అంతిమ యాత్ర ప్రారంభమైంది. పురప్రముఖులు, కార్మికులు, ఆయన స్నేహితులు వేలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంప్రదాయానుసారం అంత్యక్రియలు పూర్తి చేసి కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకున్నారు.

✧ ✧ ✧

భాస్కరమూర్తి విలాసవంతమైన భవనంలో కుటుంబ సభ్యులు అందరూ విషణ్ణ వదనాలతో వున్నారు. భాస్కరమూర్తి స్నేహితుడు, హైకోర్టు న్యాయమూర్తి ప్రభాకరమూర్తి కూడా వారితో కూర్చుని మౌనంగా దీర్ఘాలోచనలో వున్నాడు.

ఆ నిశ్శబ్ద నీరవంలో ప్రభాకరమూర్తి కంఠం ఖంగున మోగింది.

"భాస్కరమూర్తి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో మీకు తెలుసా?"

అందరూ ప్రశ్నార్థకంగా ఆయనవైపు చూశారు.

ఆయన సమాధానం చెప్పలేదు. తన దగ్గర వున్న బ్రీఫ్‌కేస్ నుంచి బరువైన పెద్ద కవరు బైటకు తీశాడు. అక్కడున్న అందరికీ ఆ కవరు చూపిస్తూ చెప్పడం ప్రారంభించాడు.

"భాస్కరమూర్తి చనిపోవడానికి సరిగ్గా వారం రోజుల ముందు ఈ కవరు నాకు రిజిష్టరు పోస్ట్‌లో పంపించాడు. నేను ఢిల్లీ వెళ్ళిన కారణంగా ఈ కవరును ఆలస్యంగా చూడటం జరిగింది.

చెప్పడం ఆపి ఆ లేఖను చదవటం ప్రారంభించాడు.

"ఆప్తమిత్రుడు ప్రభాకరమూర్తికి,

ఈ విధమైన లేఖ నేను నీకు రాయవలసి వస్తుందని జీవితంలో ఏనాడు ఊహించలేదు. బాల్యం నుండి నేనేమిటో నీకు బాగా తెలుసు. మనిద్దరమూ చిన్నతనం నుండి మానవత్వపు విలువలతో పెరిగాము. సమాజాన్ని చాలా దగ్గరగా చూశాము. సమాజానికి వీలైనంత మంచి చేయాలనే సేవాదృక్పథాన్ని మన అంతరంగాలలో పాదుగొల్పుకున్నాం. న్యాయమూర్తిగా విలువైన స్థానంలో స్థిరపడిన నువ్వు నీ బాధ్యతలను సక్రమంగా, హుందాగా నిర్వర్తిస్తున్నావు. కానీ, నేనేం చేయాలో నాకు బోధపడలేదు. దీర్ఘాలోచన చేసి ఓ దృఢమైన నిర్ణయానికి వచ్చాను. నా ఆలోచనను ఆచరణలో పెట్టే సందర్భంలో కలలో కూడా ఊహించని భయంకరమైన అనుభవాన్ని నా కుటుంబములో చవిచూశాను! అందుకే .... అవమానాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పూనుకుంటున్నాను. కానీ, నా ఆలోచనలను వీలునామా రూపంలో నీకు పంపుతూ ఆచరణలో పెట్టే బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను.

నీ

భాస్కరమూర్తి."

భాస్కరమూర్తి రాసిన ఉత్తరాన్ని చదవటం పూర్తి చేశాడు ప్రభాకరమూర్తి.

అందరివైపు ఒక్కసారి చూశాడు. అందరూ ఆయనవైపే చూస్తున్నారు. ఇంకా ఏం చెబుతాడో అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఓ గాఢమైన నిట్టూర్పు విడిచాడు ప్రభాకరమూర్తి. ఓ రెండు కాగితాలు ఆ కవరు లోంచి బయటకు తీసి వాళ్ళకు చూపిస్తూ అన్నాడు.

"నా స్నేహితుడి మరణానికి కారణమైన ఓ సంఘటన ఈ ఇంట్లో జరిగింది. ఓ కోటీశ్వరుడి నివాసంలో నాలుగు గోడల మధ్య జరిగిన ఆ సంఘటన తాలూకూ వివరాలను సవివరంగా రాసి నాకు పంపాడు. చదువుతాను .... బాగా వినండి!

ఆ కాగితాలలోని వివరాలను ....ఆకాశవాణిలో రచయితలు చదివే కథా శ్రవణంలా ఆలకిస్తున్నారు.

✧ ✧ ✧

ఓ రోజు రాత్రి పది గంటల సమయంలో భాస్కరమూర్తి భవనంలోని డైనింగ్ హాల్‌లో భాస్కరమూర్తి, ఆయన ఏకైక పుత్రుడు రాజశేఖర్

భోజనం చేయడం పూర్తి చేశారు. వ్యాపారాలకు సంబంధించిన వివరాలు మాట్లాడుకున్న తర్వాత భాస్కరమూర్తి బెడ్‌రూంలోనికి వెళ్ళబోతున్న కొడుకును ఆపాడు.

"రాజా....నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి."

"ఏమిటి నాన్నగారూ?"

"నా మనసులో చాలా కాలం నుండి ఓ కోరిక గూడుకట్టుకొని కాపురం చేస్తోంది. అది నా కోరిక కాదు .... నిజం చెప్పాలంటే అది నా జీవితాశయం".

"ఏమిటి?" ఉత్సాహంగా అడిగాడు రాజశేఖర్

"నా కల సాకారం కావాలంటే నువ్వు, మీ అమ్మ, నీ భార్య .... అందరూ సహకరించాలి." ఉపోద్ఘాతంగా చెప్పుకుపోతున్నాడు.

"చెప్పండి నాన్నగారూ ....మీ కోరికేమిటి?" చిరునవ్వుతో తండ్రి వైపు చూస్తూ అన్నాడు కొడుకు.

ఒక్క క్షణం ఆగాడు భాస్కరమూర్తి. అందరి ముఖాలను పరిశీలించి చూశాడు. ఆ తర్వాత తాపీగా చెప్పాడు.

"మన ఆదాయంలో కొంత భాగాన్ని మన పరిశ్రమలలో పనిచేస్తోన్న కార్మికులకు వాటా ఇవ్వాలని నిర్ణయించాను!"

ఉలిక్కిపడ్డారు ముగ్గురూ! ఆశ్చర్యంతో నోరు తెరిచారు.

ఊహించని భాస్కరమూర్తి నిర్ణయానికి బిత్తరపోయారు ముగ్గురూ ....

"మీకు పిచ్చి పట్టిందా ఏమిటి? మన ఆదాయంలో కార్మికులకు వాటా ఇవ్వడం ఏమిటి?" మహంకాళిలా గర్జించింది రాజ్యలక్ష్మి.

"వయస్సు పెరుగుతోంది కదా? మామయ్య గారికి మతిస్థిమితం గతి తప్పుతోందేమో!? "కోడలు వాణి వ్యంగ్య బాణాలు ప్రయోగించింది.

"పని చేసినందుకు జీతాలిస్తున్నాం ....బోనస్ లిస్తున్నాం ....ఇవి చాలక ఈ కూలి జనాలకు వాటా లివ్వాలా? అంటే వాళ్ళు కూడా మనతో బాటు మన పరిశ్రమలలో భాగస్వాములవ్వాలనేదేగా మీ అభిప్రాయం!?".

అసహనంగా, కోపంగా మాట్లాడాడు కొడుకు రాజశేఖర్.

"అవును". తన అభిప్రాయాన్ని ఒక్క మాటతో స్థిరంగా చెప్పాడు తండ్రి.

"మీ అభిప్రాయంతో మేమెవ్వరమూ ఏకీభవించడం లేదు".

ముగ్గురూ ఒకేసారి ఏక కంఠంతో చెప్పారు గట్టిగా.

"ఎందుకని?" తాపీగా ప్రశ్నించాడు భాస్కరమూర్తి.

"ఎందుకేమిటి? మనం కష్టపడి సంపాదించుకున్న ఆస్తుల్ని అలగా జనం పాలు చేస్తారా?"

తీవ్రంగా ప్రశ్నించింది భార్య రాజ్యలక్ష్మి.

"ఇవ్వాళ వాటా ఇస్తామంటున్నారు ....కొన్ని రోజుల తర్వాత మాకు పుట్టిన బిడ్డల్ని ఆ లేబర్ బిడ్డలకిచ్చి పెళ్ళి చేయమంటారు? ఇదేనా మీరు చెప్పే ఆదర్శం?" పూర్తిగా ఎదురు తిరిగి మాట్లాడాడు కొడుకు.



"ఇలాంటి దానాలు, ధర్మాలు నేనెక్కడా చూడలేదు. కోటీశ్వరుడికి ఒక్కగానొక్క కొడుకని మీ అబ్బాయికి నన్నిచ్చి పెళ్ళి చేశారు మా అమ్మ నాన్న! ఆస్తుల్ని లేబర్‌పాలు చేసి మమ్మల్ని బికారుల్ని చేస్తే నేను సహించను".

ఆవేశంగా మాట్టాడింది కోడలు వాణి.

" ఈ సంపద నా స్వార్జితం. మీరు అంగీకరించినా అంగీకరించకపోయినా నిర్ణయం తీసుకునే హక్కు నాకుంది. కుటుంబ సభ్యులకు తెలియజేయాలనే సత్సాంప్రదాయాన్ననుసరించి మీకు ముందుగా చెప్పాను ....అంతే!

రేపే డాక్యుమెంటేషన్ పూర్తి చేస్తాను. దానితోపాటు వీలునామా కూడా రాస్తాను!" తాపీగా, దృఢంగా తన నిర్ణయాన్ని తెలియజేశాడు.

"నీకు పిచ్చి పట్టిందా? మాకు ఇష్టం లేదని నీ ముఖం మీదే చెబుతున్నాం కదా! అర్థం కావడం లేదా?" తొలిసారిగా తండ్రిని ఏకవచనంతో సంబోదించి ఆగ్రహం వ్యక్తం చేశాడు కొడుకు. జీవితంలో మొట్టమొదటిసారిగా తనను తూలనాడిన కొడుకు వైపు కొన్ని క్షణాలు నిశ్చలంగా చూశాడు.

"నా నిర్ణయంలో మార్పులేదు!" సూటిగా స్థిరంగా చెప్పాడు భాస్కరమూర్తి.

"నన్నెందుకు కన్నావురా దరిద్రుడా!? అడుక్కుతింటానికి నా చేతికి ఓ చిప్ప ఇవ్వాలనుకున్నావురా మూర్ఖుడా!?"

ఆవేశంతో ఊగిపోతూ తండ్రి చెంపపై బలంగా కొట్టాడు రాజశేఖర్!

ఖిన్నుడయ్యాడు భాస్కరమూర్తి!

ఎంతో గారాబంగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు!

ఎప్పుడూ తండ్రి మాటకు ఎదురు చెప్పని కొడుకు!!

ఈ రోజు ఎదురు తిరిగాడు .... పిచ్చికుక్కలా రంకెలేసి కన్నతండ్రి మీదనే చేయి చేసుకున్నాడు ....ఘోరంగా అవమానించాడు! కట్టుకున్న భార్య, ఇంటికి కోడలుగా వచ్చిన యువతి ముందు తన బిడ్డ పరుష పదజాలంతో దూషించి చెంప ఛెళ్ళు మనిపించాడు.

భాస్కరమూర్తి హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి!

ఈ అవమానభారంతో భవిష్యత్ జీవితాన్ని కొనసాగించలేనని నిర్ణయించుకున్నాడు".

జరిగిన సంఘటన తాలూకూ వివరాలను చదివి వినిపించిన ప్రభాకరమూర్తి ఒక్కసారి అందరి ముఖాలవైపు చూశాడు.

తప్పుచేసిన భావన భార్య, కొడుకు, కోడలు ముఖాలలో స్పష్టంగా కన్పించింది .... సిగ్గుతో తలలు వంచుకున్నారు.

కొన్ని క్షణాలు ఊపిరి పీల్చుకొని ప్రభాకరమూర్తి మాట్లాడటం ప్రారంభించాడు.

"సమాజంలో కొందరు మనుష్యులు ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకొని పుడతారు. అలాంటి మహాపురుషులలో నా స్నేహితుడు వాసిరెడ్డి భాస్కరమూర్తి ఒకడైనందుకు గర్వపడుతున్నాను. సమసమాజ స్థాపనా లక్ష్యం కేవలం మాటలకే పరిమితం కాకుండా అచరణాత్మకంగా నిరూపించాలని అతను కన్న కలను సాకారం చేసే బాధ్యతను నాకు అప్పగించి వెళ్ళాడు. అతని ఆశయాన్ని సఫలీకృతం చేసే ప్రయత్నంలో ముందుకు సాగుతాను".

భాస్కరమూర్తి రాసిన వీలునామా కాపీని రాజశేఖరానికిచ్చి .... బైటకు వెళ్ళి పోయాడు ప్రభాకరమూర్తి.

అందరూ ఆయన వెళ్ళిన వైపు బొమ్మల్లా చూస్తూ వుండి పోయారు!

✦

# మొక్కజొన్న పాకం గారెలు

**కావాల్సిన పదార్థాలు**

తాజా మొక్కజొన్న గింజలు–2 కప్పులు, బియ్యప్పిండి–కప్పు, బొంబాయి రవ్వ–అర కప్పు, బెల్లం తురుము– కప్పు, యాలకులు–3, వంట సోడా –చిటికెడు, నూనె– వేయించడానికి సరిపడా.

**తయారీ**

మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బాలి. అందులోనే బొంబాయి రవ్వ, బియ్యప్పిండి, వంట సోడా వేసి కలిపి ఐదు నిమిషాలు పక్కన ఉంచాలి.

మందపాటి గిన్నెలో బెల్లం తురుము వేసి అది మునిగేవరకూ నీళ్లు పోసి మరీ ముదురు లేత కాని పాకం రానివ్వాలి. అందులోనే యాలకుల పొడి వేసి కలిపి పక్కన ఉంచాలి. బాణలిలో నూనె వేసి కాగాక పిండి మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుని అరచేతిలో నూనె లేదా నీళ్ళు రాసుకుని గారెల్లా చేసుకుని కాగిన నూనెలో సిమ్‌లో వేయించి తీయాలి. తీసిన వెంటనే బెల్లం పాకంలో వేసి ఐదు నిమిషాలు ఉంచి వడ్డించాలి.

## మసాలా వడ

**కావాల్సిన పదార్థాలు**

మినపప్పు–కప్పు, సెనగపప్పు–కప్పు, చింతచిగురు–4 కప్పులు, ఉప్పు–2 టీస్పూన్లు, పచ్చి మిర్చి– ఐదు, అల్లం వెల్లుల్లి ముద్ద– టీ స్పూను, నూనె– సరిపడా, రస్కుల పొడి–కప్పు, కార్న్‌ఫ్లోర్–2 టీ స్పూన్లు, జీలకర్ర– టీ స్పూన్లు.

**తయారీ**

ముందుగా పప్పులు నానబెట్టి ముద్దలా రుబ్బాలి. తరువాత శుభ్రం చేసి కడిగిన చింతచిగురు, పచ్చి మిర్చి, అల్లం వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు అన్నీ వేసి కలపాలి. మిశ్రమాన్ని ముద్దలుగా చేసుకుని వడలుగా చేసి రస్కుల పొడి, కార్న్ ఫ్లోర్ మిశ్రమంలో దొర్లించి కాగిన నూనెలో వేయించి తీయాలి.

## పనీర్ సమోసా



**కావాల్సిన పదార్థాలు**

పనీర్–కప్పు, మైదాపిండి–కప్పున్నర, నూనె–కొద్దిగా, జీలకర్ర– చెంచా, పచ్చిమిర్చి– రెండు, ఉల్లిపాయ– ఒకటి, క్యారెట్– ఒకటి, పచ్చి బఠాణీలు – అర కప్పు, జీలకర్ర పొడి– చెంచా, ఉప్పు, కారం– తగినంత, చాట్ మసాలా–అర కప్పు

**తయారీ**

బఠాణీలు బంగాళదుంపల్ని విడివిడిగా ఉడికించి చేత్తో మెత్తగా మెదపాలి. తరువాత పొయ్యి మీద బాణలి పెట్టి అందులో నూనె వేడి చేసి జీలకర్ర, పచ్చి మిర్చి, ఉల్లిపాయ, క్యారెట్ తరుగు, బఠాణీ, బంగాళదుంప మిశ్రమం వేసి వేయించాలి. తరువాత పనీర్ తురుము, జీలకర్ర పొడి, కారం, చాట్ మసాలా, ఉప్పు వేసి మగ్గించి దించేయాలి. ఒక గిన్నెలోకి మైదా పిండి తీసుకొని చెంచా నూనె, తగినంత ఉప్పు చేర్చి చపాతీ పిండిలా కలపాలి. చిన్నచిన్న ఉండలుగా చేసి చపాతీలా ఒత్తుకొని దాన్ని కోన్ మాదిరి చేసి అందులో పనీర్ మిశ్ర మాన్ని ఉంచి సమోసాలా మడ త పెట్టాలి. తరువాత బాణ లిలో నూనె వేడి చేసి సమోసా లను గోధుమ వర్ణంలోకి వచ్చే వరకు వేయించి తీస్తే సరిపో తుంది. వేడి వేడి పనీర్ సమోసా లను టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీతో తింటే రుచిగాఉంటాయి.

## ఆలూ రింగ్స్

**కావాల్సిన పదార్థాలు**

బంగాళదుంపలు–మూడు పెద్దవి ( చెక్కు తీసి ముక్కలు తరగాలి), క్రీమ్–అర కప్పు, ఉప్పు కలపని వెన్న– పావు కప్పు, ఉల్లిపాయ తరుగు–అర కప్పు, ఉల్లికాడల తరుగు–కొద్దిగా, మైదా– రెండు కప్పులు, బియ్యప్పిండి–పావు కప్పు కన్నా తక్కువ, వెల్లుల్లి ముద్ద– ఒకటిన్నర టేబుల్ స్పూను, కోడిగుడ్లు–రెండు (గిలకొట్టాలి), ఉప్పు, మిరియాల పొడి– రుచికి తగినంత, నూనె– వేయించడానికి సరిపడా, బ్రెడ్ పొడి– పావు కప్పు

**తయారీ**

బంగాళ దుంపల్ని ఉడికించుకుని ముక్కల్లా చేసుకోవాలి. వాటిలో క్రీమ్, వెన్న వేసి బాగా కలపాలి. తరువాత ఉల్లిపాయ తరుగు, ఉల్లికాడల తరుగు, తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. అలాగే నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని మరోసారి కలపాలి. ఈ మిశ్రమాన్ని చెగోడీల్లా చుట్టుకుని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తరువాత బయటకు తీసి బ్రెడ్‌పొడి, గుడ్డులోని తెల్ల సొనా అద్ది కాగుతున్న నూనెలో వేయాలి. బాగా వేగాక తీసేస్తే వేడి వేడిగా, కరకరలాడే ఆలూ రింగ్స్ సిద్ధం. వీటిని పుదీనా చట్నీ లేదా టొమాటో సాస్‌తో కలిపి తింటే చాలా రుచిగా ఉంటాయి.

## చుక్కలు కలపండి

## వరుసలో పెడదాం

ఇక్కడ కొన్ని అక్షరాలకు అస్సలు కుదురు లేదు. ఊరకే అటూ ఇటూ జంప్ చేసేశాయి. వాటిని సరైన క్రమంలో పెడితే అర్థవంతమైన మాట ఒకటి వస్తుంది. మరి గుర్తించండి.

| | |
|---|---|
| LOCO | □□O□ |
| SOPECLPI | □□□S□□□□ |
| ATEH | □E□□ |
| MDONELAE | L□□□□□□□ |
| NASD | □□N□ |
| YAINPLG | □□□□I□□ |

## బుజ్జి స్టార్

ఈ ఫొటోలో వున్న బాలనటుడు ఎవరో చెప్పుకోండి. ఇప్పుడు హీరో అనుకోండి.

## దారి కనుక్కోండి

## ఎక్కడ దాక్కున్నాయో

ఈ బొమ్మలో కొన్ని వస్తువులు దాక్కున్నాయి. 1. కొవ్వొత్తి 2. స్కేటింగ్ బూటు 3. బూటు 4. ఐస్‌క్రీమ్ 5. వాచీ 6. పడవ 7. స్ట్రా బెర్రీ 8. పుస్తకం. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టాలి.

## పదం పదం

ఈ పడవలో నాలుగు జంతువులతో పాటు బోలెడన్ని అక్షరాలు కూడా ప్రయాణిస్తున్నాయి. పదాల్లో 15 పదాలు దాక్కున్నాయి. అడ్డంగా నిలువుగా వంకరగా ఎలాగైనా వుండొచ్చు. వాటిని గుర్తించి సున్నా చుట్టండే.




| | | |
|---|---|---|
| animals | flood | Noah |
| Ararat | Genesis | rain |
| ark | gopher | rainbow |
| covenant | Ham | raven |
| dove | Japheth | Shem |

జవాబులు

**వరుసలో పెడదాం** : cool, heat, sand, playing, lemonade.

**బుజ్జి స్టార్** : తరుణ్

## పప్పీ ఏది ?

ఇక్కడ బోలెడన్ని కుక్క పిల్లల బొమ్మలున్నాయా? అయితే ఇందులో నిజమైన పప్పీ కూడా ఒకటి వుంది. అది ఏదో చెప్పుకోండి.

## తేడా మనిషి?

ఈ చిత్రంలో ఉన్న వారంతా చాలా హడావిడిగా వున్నట్టు కనిపిస్తున్నారు. అయితే ఇందులో ఒకరు తేడాగా ఉన్నారు. వారు ఏవరు?

## కథ చదివి వినిపిస్తే... తల పని ఫ్రీ

మీలాంటి కొందరు చిన్నారులు వెళ్లడానికి ఇష్టపడని చోటు ఒకటుంది. అదేంటో చెప్పుకోండి. ఆ...సెలూన్. నెలకో, రెండు నెలలకో ఒకసారి తప్పనిసరిగా వెళ్లాలి. అయిష్టంగా గంటకో అడుగు వేస్తూ సాధ్యమైనంత ఆలస్యం చేస్తూ లోపలికి అడుగేస్తుంటారు కదా. ఒక్కోసారి మీకు అనిపించొచ్చు. అసలు క్రాపు చేయించుకోవడమే ఇష్టముండదు. ఇంక పైగా అతనికి డబ్బులు కూడా ఇవ్వాలా? అని. అమెరికాలో 'స్పార్క్ ఫ్యామిలీ హెయిర్ సెలూన్'లో ఫ్రీగా తల పని చేస్తారు తెల్సా. అయితే ఇక్కడ ఒక షరతు వుంది. సెలూన్‌కి వచ్చిన చిన్నారులు తల పని చేసే అంకుల్‌కి కథల పుస్తకం చదివి వినిపించాలి. ఆ షాపులోనే బోలెడన్ని పుస్తకాలుంటాయి. వాటిలోంచి నచ్చిన పుస్తకం ఎంచుకోవచ్చు. 'హేయ్ భలేగా వుందే. ఇలా వుంటే మేం బలవంతంగా ఎందుకు వెళ్తాం. సంతోషంగా గెంతులు వేస్తూవెళ్తాం కదా' అనిపిస్తోంది కదూ. ఇదంతా కోర్ట్‌నీ హోమ్స్ అంకుల్‌కి వచ్చిన ఐడియా. ఈయన ప్రతి శనివారం ఇలా ఉచితంగా తల పని చేస్తున్నారు మీలాటి చిన్నారులకు. కథ చదివి వినిపిస్తేనే అని మర్చిపోకండి. ఇంతకీ ఈ అంకుల్ ఎందుకిలా చేస్తున్నాడను కున్నారు? ఈ మధ్య బడి పుస్తకాలు మినహా ఇతర పుస్తకాలు చదవడం తగ్గిపోయిందని.. ఆ అలవాటును పెంచేందుకే ఈ ప్రయోగం చేస్తున్నాడట.

# అసాధారణ జీవిత కథ 'నేను మలాలా'



నేను మలాలా, మలాలా యూసఫ్ జాయ్ (క్రిస్టీనా ల్యాంబ్ సహకారంతో), **తెలుగు:** కె.సత్యరంజన్, **పేజీలు:** 320, **ధర:** రూ.200, **ప్రతులకు:** ఐద్వా స్టేట్ ఆఫీస్, కృష్ణలంక, విజయవాడ-520013.

సాధారణంగా జీవిత చరమాంకంలో జీవిత కథలు రాసుకుంటారు. మలాలా ఈ పుస్తకం రాసేనాటికి ఆమెకు ఓటు హక్కు వయస్సు కూడా లేదు. 'నేను మలాలా' పుస్తకం ఆటపాటలతో హాయిగా గడపాల్సిన బాల్యాన్ని పోగొట్టుకున్న బాలిక కథ. ప్రశాంతంగా పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన వయస్సులో ఆ చదువుకునే హక్కు కోసం ప్రాణాలొడ్డి పోరాడిన మలాలా కథ. స్వాత్ లోయతో పాటు పాకిస్థాన్‌లోని ఏజన్సీ ప్రాంతాలను తాలిబన్లు ఆక్రమించి ప్రజలను వెంటాడి నరమేథం సృష్టించారు. అన్ని హక్కులను కోల్పోయి తాలిబన్ల మతమౌఢ్యపు తీవ్రవాద చర్యలకు బలైన ప్రజల గాథ 'నేను మలాలా'.

మలాలా కుటుంబం తాలిబన్ల ఆదేశాలను ధిక్కరించింది. అనేక బెదిరింపులు, దాడుల మధ్య మలాలా కుటుంబం గడిపిన కాలాన్ని ఈ పుస్తకం మనకు సజీవంగా పట్టిస్తుంది. ఒక సాధారణ బాలిక ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత వ్యక్తిగా రూపొందడానికి కావలసిన నేపథ్యం మలాలా జీవితం చుట్టూ ఏర్పడింది. ఈ పుస్తకం కేవలం మలాలా యూసుఫ్‌జాయ్ కుటుంబం తాలిబన్ల కారణంగా పడ్డ బాధలను వివరించేది మాత్రమే కాదు. నేడు ప్రపంచం అంతా ఏ సమస్యల గురించి మాట్లాడుకుంటుందో ఆ అంశాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. తీవ్రవాదం, బాలికల చదువు, స్త్రీల హక్కులు, పేదరికం, పాలకుల విధానాలు ఇవన్నీ ఈ పుస్తకంలో అంశాలే.

ఈ పుస్తకంలో మలాలాతో పాటు మలాలా తండ్రి జియావుద్దీన్ కూడా హీరోనే. ఆధునిక భావాలతో అలరారే విద్యావేత్త జియావుద్దీన్. ఉదాత్తమైన ఆశయాలతో బాలబాలికలకు విద్యనందించాలనే తపనతో పాఠశాలను స్థాపించి నడపడానికి నానాపాట్లు పడ్డాడు. మలాలా తన తండ్రి పాఠశాలలోనే చదువుకుంది. తన తరగతిలో మొదటిశ్రేణి విద్యార్థినిగా రాణించింది. తన చదువు గురించీ, పాఠశాల గురించి, టీచర్ల గురించీ చాలా విపులంగా ఈ పుస్తకంలో వివరించింది. స్నేహితులతో చిరుకొట్లాటలు, తమ్ముళ్లతో గిల్లికజ్జాలు, తండ్రి జియావుద్దీన్ అనుబంధం, తల్లి తోర్‌పెకాయ్ ప్రేమ గురించి మనసుకు హత్తుకునేలా రాసింది.

అమెరికాలోని వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌పై విమానదాడికి పాల్పడిన బిన్‌లాడెన్‌ను మట్టుపెట్టిన విధానాన్ని వివరంగా రాసింది మలాలా. అమెరికా బిన్‌లాడెన్‌ను మట్టుపెట్టడానికి చేపట్టిన 'డ్రోన్' దాడులను ఆసక్తికరంగా వివరిస్తుంది. అమెరికా తను అనుకున్నది చేయడానికి ఎంతటి అతిక్రమణలకైనా పాల్పడుతుందని మలాలా రాసిన వివరాలు తెలియజేస్తాయి.పాకిస్థాన్ పాలకులకు కూడా తెలియకుండా అమెరికా తన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చొరబడిన విధానం ఆందోళనకు గురిచేస్తుంది. తీవ్రవాదుల పట్ల పాకిస్థాన్, అమెరికా విధానాలు ప్రజల జీవితాలతో ఎలా చెలగాటమాడాయో మలాలా తీవ్రగొంతుతో చెబుతుంది.

మనదేశ విభజన సమయంలో రెండువేపులా జరిగిన భయానక నరమేథం గురించి లెక్కలతో సహా వివరిస్తూ చాలా ఆవేదన చెందుతుంది మలాలా. తన దేశంలోని అస్థిరమైన పాలనా వ్యవస్థ ప్రజలను ఎంతగా ఇబ్బందులకు గురిచేస్తుందో వివరిస్తుంది. ఈ ప్రస్తావనలన్నీ పాఠకుడికి ఆ దేశంలో రెండు దశాబ్దాలుగా జరుగుతున్న పరిణామాలను వాస్తవిక కోణంలో అర్థం చేయిస్తాయి.

ఆచారాలు, సంప్రదాయాల పేరుతో మతమౌఢ్యం తీవ్రవాదరూపం తీసుకోవడాన్ని శక్తివంతంగా నిలదీసింది మలాలా. ఆడవాళ్ళు చదువుకోరాదని ఎక్కడ ఉందో చూపించండని నినదించింది. ఒక పక్క ఆధునిక ప్రజాస్వామ్య పవనాలు ప్రపంచం నిండా కనపడుతున్నాయి. మరోపక్క ఛాందసపు భావజాలంతో నిండిన సంప్రదాయాలు, కట్టుబాట్లు మనుషులను పీడిస్తున్నాయి. ఈ వైరుధ్యాల్ని ఈ పుస్తకం చాలా చక్కగా చిత్రీకరించింది.

'తాలిబాన్లు నన్ను చంపాలనుకున్నారు. కానీ వారి చర్యల వల్ల నా ఆశయాలు మరింత పదునెక్కాయి. మరింత విస్తరిస్తున్నాయి. వారు విఫలం చెందారు' అని ఐక్యరాజ్యసమితి వేదికపై ఘంటాపథంగా చెప్పడం మలాలాకే చెల్లింది. 'తుపాకులు, తూటాలు కాదు పుస్తకాలూ, కలాలూ కావాలి' అనే ఆమె ప్రసిద్ధ నినాదం కూడా ఆమె ఆశయాన్ని ప్రతిధ్వనిస్తుంది. భీతిల్లచేసే సంఘటనలకు సైతం చెక్కుచెదరకుండా ఆత్మవిశ్వాసంతో హక్కుల పతాకమై నిలిచింది మలాలా. 'తాలిబన్లు మా పుస్తకాలు, పెన్నులు ధ్వంసం చెయ్యగలరేమో కానీ మా ఆలోచనలను ధ్వంసం చేయ్యలేరుగా." అంటూ తీవ్రవాదాన్ని సవాలు చేస్తున్న మలాలాకు ప్రపంచం జేజేలు పలికింది. 'ఇహ మీదట ఈ ప్రపంచం నన్ను 'తాలిబాన్ కాల్పులకు గురైన ఆడపిల్ల' అని గుర్తించే దానికన్నా 'చదువుకునే హక్కుకోసం పోరాడిన ఆడపిల్లగా గుర్తింపబడడమే నాకు ఇష్టం, అందుకోసం నా జీవితాన్ని పూర్తిగా అంకితం చేస్తాను." అనడంలో ప్రపంచానికి ఒక సందేశాన్ని అందించిన మలాలా జీవితం నేటి యువతకు అత్యంత స్ఫూర్తిదాయకం. ఈ పుస్తకంలోని అంశం ప్రాధాన్యతను గురించి ఎవరికీ చెప్పనక్కర్లేదు. మలాలా ఈ రోజున బాలికలు చదువుకునే హక్కుకోసం పోరాడుతున్న యువతి. ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలిసిన నోబుల్ బహుమతి గ్రహీత. బాలికల హక్కుల కార్యకర్త. ఈ స్ఫూర్తివంతమైన, ఉత్తేజకరమైన మలాలా పసి జీవితాన్ని అంతే స్థాయిలో ఈ పుస్తకం మనముందు ఉంచుతుంది. ఈ పుస్తకం అనువాదం అనిపించదు. తెలుగు పుస్తకం చదువుతున్నంత హాయిగా ఉంటుంది.

**- వీరప్రసాద్**

# నగర కుటీరం

ఆకాశహర్మ్యాలు...భారీ భవనాలు...విలాసవంతమైన ఫర్నిచర్ ... ఏవీ లేవు. అంతా వంద చదరపు అడుగుల చోటులోనే. పడక.. వంట... చదువు ... కాలకృత్యాలు... అన్నీ... అయిపోతుంటాయి. హంగూ ఆర్భాటం లేని సాదాసీదా ఇళ్లల్లో ప్రశాంతంగా వుంటోంది జీవితం. ఎక్కడా అంటే అమెరికాలో. మామూలుగా ఇక్కడ 2,600 చదరపు అడుగుల స్థలంలో ఇళ్లు కట్టుకుంటారు. ఈ బుజ్జి ఇళ్లను మాత్రం వంద చదరపు అడుగుల్లోనే పొందికగా కట్టేశారు. అతి తక్కువ ఖర్చుతో... అప్పల వాళ్ల భయాలు... ఒత్తిళ్లు... ఏవీ లేకుండా హాయిగా ప్రశాంతంగా బతికేస్తున్నారు కొందరు అమెరికన్లు. అంతే మరి! సుఖసంతోషాలు పడవల్లాంటి కార్లలో... లంకంత ఇళ్లలో వుండవు. స్వచ్ఛమైన మనసులతో కుటీరాల్లో వున్నా రోజులు ఆనందంగా గడిచిపోవూ.

# స్ట్రీట్ ఆర్ట్‌కు పట్టం

స్ట్రీట్ ఆర్ట్‌కు వీధులే కేన్వాస్‌లు. కానీ వీటికి గేలరీని తెరిచేసింది కాలిఫోర్నియాలోని లాంగ్ బీచ్ మ్యూజియం. వీధి కళలకు స్టుడియో సెట్టింగ్‌లు మిక్స్ చేసి వినూత్న ప్రదర్శనలు నిర్వహిస్తోంది. స్ట్రీట్ ఆర్టిస్ట్‌లు స్వేచ్ఛగా తమ కళను ఇక్కడి గోడలకు అచ్చు గుద్దేసి వెళ్లొచ్చు. వాటికి స్టుడియో ఆర్టిస్ట్‌లతో మరిన్ని సొబగులు అద్దుతారు. కొన్నివారాల పాటు వీటిని ప్రదర్శించాక మళ్లీ మరో ఎగ్జిబిషన్‌కు గోడలు పరుస్తారు. స్ట్రీట్ ఆర్ట్‌కు పటం కట్టి గేలరీలో పెడుతున్న ఈ మ్యూజియం ప్రస్తుతం 'వైటాలిటీ అండ్ వెర్స్ట్రాన్స్‌ఫార్మింగ్ ది అర్బన్ ల్యాండ్‌స్కేప్' పేరిట ప్రదర్శన ఏర్పాటుచేసింది. వీధి కళకు సంప్రదాయ కళలను జతచేసి వీటిని వీక్షకుల కనులకు అంకితమిస్తోంది. జూన్ నెలాఖరున ప్రారంభమైన ప్రస్తుత ప్రదర్శన అక్టోబర్ నెలాఖరుతో ముగుస్తుంది. ఆరోన్ హార్కీ, అలెక్స్ యేన్స్, క్రిప్టిక్, హాట్ టీ, మెగ్స్, సేబర్, ఆడ్రీ కవాసకీ లాంటి స్ట్రీట్ ఆర్టిస్టులు గోడల దుమ్ము రేపారు.

●